

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 334 | హైదరాబాద్ | మంగళవారం | 12-05-2026 | పేజీలు: 08


# బండి భగీరథ్ కేసుపై సీఎం రేవంత్ సీరియస్

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు

- ఫిర్యాదు ఆలస్యానికి కారణాలపై డీజీపీని ప్రశ్నించిన సీఎం
- మోదీ పర్యటన భద్రతా పనుల వల్ల జాప్యం జరిగిందని పోలీసుల వివరణ
- సమగ్ర దర్యాప్తుకు ప్రత్యేక బృందాల ఏర్పాటు ఆదేశం
- కేసు పర్యవేక్షణ బాధ్యత కూకట్‌పల్లి డీసీపీ రుతురాజ్‌కు అప్పగింత
- పేట్‌బషీరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో పోక్సో కేసు నమోదు
- బాలిక తల్లి ఫిర్యాదుతో చట్టపరమైన చర్యలు ప్రారంభం
- భగీరథ్ తరఫున పరస్పర ఫిర్యాదు - బెదిరింపుల ఆరోపణలు
- ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసిన పోలీసులు
- బాలల హక్కుల కమిషన్ స్వయంగా విచారణలోకి ప్రవేశం



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతోంది. ఈ కేసుపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. కేసు నమోదులో జాప్యం ఎందుకు జరిగిందో వివరణ ఇవ్వాలని ఆయన డీజీపీ సీవీ ఆనంద్‌ను ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సమీక్ష సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ వివరాలు అందజేశారు. ఈనెల 8న ఫిర్యాదు అందినప్పటికీ, అప్పట్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్లలో పోలీసు సిబ్బంది బిజీగా ఉండటం వల్ల చర్యల్లో ఆలస్యం జరిగిందని ఆయన వివరించారు. దీనిపై స్పందించిన సీఎం వెంటనే కేసును వేగవంతం చేయాలని ఆదేశించారు.

సీఎం ఆదేశాల మేరకు డీజీపీ కేసు దర్యాప్తును మరింత సమగ్రంగా కొనసాగించేందుకు

..మిగతా 2లో

# భారత్ సత్తాకు సోమనాథ్ పునర్నిర్మాణమే నిదర్శనం



- గుజరాత్ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ
- సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణానికి 75 ఏళ్లు పూర్తి
- ఘనంగా వేడుకలు నిర్వహిస్తున్న ప్రభుత్వం
- 75 రూపాయల స్మారక నాణెం, ప్రత్యేక పోస్టల్ స్టాంపు విడుదల
- విదేశీ ఆంక్షలకు, ఒత్తిళ్లకు భారత్ ఎన్నడూ తలొగ్గదని మోదీ వెల్లడి
- 1998 పోఖ్రాన్ అణు పరీక్షల స్ఫూర్తిని గుర్తు చేసుకున్న ప్రధానమంత్రి
- ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుకోవడంలో భారత్ ప్రపంచానికే ఆదర్శం
- చంద్రయాన్ రోవర్ దిగిన ప్రాంతానికి 'శివశక్తి పాయింట్' అని నామకరణం
- సూర్యకిరణ్ టీమ్ విమాన విన్యాసాలు మరియు భారీ రోడ్‌షోతో ఘనస్వాగతం
- సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి నివాళులర్పించిన ప్రధాని నరేంద్ర మోదీ

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** భారతదేశం తన సంస్కృతిని, సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడంలో ప్రపంచంలో ఎవరి ఒత్తిళ్లకు లేదా ఆంక్షలకు తలొగ్గబోదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గుజరాత్‌లోని చారిత్రాత్మక సోమనాథ్ మహాదేవ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'అమృత్ మహోత్సవం'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమనాథ్ పునర్నిర్మాణ వైభవాన్ని చాటిచెప్పేలా 75 రూపాయల స్మారక నాణేన్ని మరియు ప్రత్యేక పోస్టల్ స్టాంపును ప్రధాని ఆవిష్కరించారు. సద్భావన మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన మోదీ, సోమనాథ్ ఆలయం కేవలం ఒక కట్టడం మాత్రమే కాదని, అది వేల ఏళ్ల భారతీయ ఆధ్యాత్మిక చైతన్యానికి మరియు మన పూర్వీకుల అజేయమైన సంకల్పానికి నిదర్శనమని కొనియాడారు. ఎంతమంది విధ్వంసకారులు దాడులు చేసినా, ఎన్నిసార్లు సంపద దోపిడీకి గురైనా సోమనాథ్ మళ్లీ మళ్లీ సగర్వంగా నిలబడటమే భారత్ యొక్క అసలైన శక్తి అని ఆయన అభివర్ణించారు.

ఆధ్యాత్మిక అంశాలతో పాటు దేశ రక్షణ మరియు

..మిగతా 2లో



# తెలంగాణకు ఏం ఇచ్చారు?

- జనగణన ఫారమ్‌లలో లోపాలు ఉన్నాయన్న పొన్నం
- ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్నారు.. తెలంగాణకు ఏం ఇచ్చారు?
- బీసీలను విస్మరించారని విమర్శ
- గత 12 ఏళ్లలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమని సవాల్

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన, హౌస్ హోల్డ్ సర్వే ఫారమ్‌లలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సర్వే ఫారమ్‌లో కేవలం ఎస్సీ, ఎస్టీ అనే ఆప్షన్లు మాత్రమే ఉన్నాయని, మెజారిటీ జనాభా కలిగిన బీసీల ప్రస్తావనే లేకపోవడం వారిని

..మిగతా 2లో

# బండి భగీరథ్ కేసుతో బీజేపీకి సంబంధం లేదు

- చట్టం తన పని తాను చేసుకుపోతుంది
- ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- బండి సంజయ్ కుటుంబానికి చెందిన వ్యక్తిగత అంశమని వ్యాఖ్య
- చట్టపరమైన విచారణకు పూర్తిస్థాయి మద్దతు అని ప్రకటన
- అవసరమైతే కుటుంబ సభ్యులపై కూడా విచారణ జరగాలని సూచన
- కేసులో రాజకీయ రంగు అద్దొద్దని విజ్ఞప్తి
- మీడియాతో మాట్లాడిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు
- పార్టీని వ్యక్తిగత ఆరోపణలతో కలపొద్దని స్పష్టం
- చట్టం తన పని తాను చేసుకుపోతుందని వ్యాఖ్య
- నిష్పక్షపాత దర్యాప్తుకు సహకారం ఉంటుందని హామీ
- ప్రజల్లో అపోహలు సృష్టించొద్దని సూచన



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన కేసు నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ రామచందర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుకు బీజేపీతో ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడిన రామచందర్‌రావు, ఇది పూర్తిగా బండి సంజయ్ కుటుంబానికి సంబంధించిన వ్యక్తిగత అంశమని అన్నారు. “ఇది కుటుంబంలో

..మిగతా 2లో

# మెడిసిన్ రవాణాకోసం స్పెషల్ ట్రైన్

- తొలి రెగ్యులర్ “ఔషధి ఎక్స్‌ప్రెస్” రైలును తెలంగాణకు కేటాయించడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు.
- అత్యాధునిక సేవల ద్వారా సరుకు రవాణా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారుతోంది.
- ప్రత్యేక రీఫర్ రైలు వల్ల హైదరాబాద్ ఫార్మా కంపెనీలకు భారీ ప్రయోజనం కలగనుంది.
- ఔషధాలను దేశవ్యాప్తంగా మరియు విదేశాలకు సమయానికి చేరవేయడం సులభం అవుతుంది.
- ఔషధాల నాణ్యతను కాపాడటంలో శీతలీకరణ సదుపాయాలు కీలకం.



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** అత్యాధునిక సేవలను కల్పించడంలో నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలతో భారతీయ రైల్వే దూసుకపోతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఫార్మా క్యాపిటల్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ నుంచి ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ కు ఔషధాలను సరఫరా చేసేందుకు ఔషధి ఎక్స్‌ప్రెస్’ పేరుతో ప్రత్యేక ఫార్మసీ రైలును కేంద్రం ప్రారంభించడం హర్షణీయమన్నారు. మొదటి రెగ్యులర్ ‘ఔషధి ఎక్స్‌ప్రెస్’ ప్రత్యేక రైలును తెలంగాణకు

..మిగతా 2లో

# యూరియా బఫర్ స్టాక్ సిద్ధం చేయాలి

- రామగుండం నుండి రాష్ట్రానికి కనీసం 90 శాతం సరఫరా చేయాలి
- రైతులకు నానో యూరియాపై కంపెనీలు కూడా అవగాహన కల్పించాలి
- ఎమ్మార్పి కంటే ఎక్కువ ధరకు ఎరువుల అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** రాష్ట్రంలో జూన్ మొదటి వారంలో వరి నాట్లు ప్రారంభమైతాయని అధికారులు ఈనెలాఖరు నాటికి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన మిగిలిన యూరియాను అత్యవసరంగా రాష్ట్రానికి తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం సచివాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 1.46 లక్షల మెట్రిక్ టన్నుల

..మిగతా 2లో

# గుప్తనిధుల కోసమే 800 ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయాన్ని కూల్చారా?



- ఆలయ కూల్చివేతపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి
- బాధ్యులను అరెస్ట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
- పురాతన దేవాలయాన్ని యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించి, పురావస్తుశాఖకు అప్పగించాలి
- గుప్తనిధుల అంశంపై విచారణ జరపాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** వరంగల్ లోని అశోక్ నగర్లో 800 ఏళ్ల చరిత్ర కలిగిన.. శైవక్షేత్రంగా పిలిచే అతి పురాతన ఆలయాన్ని ప్రభుత్వం కూల్చివేయడంపై బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఫైరయ్యారు. ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో ఆలయాన్ని కూల్చివేయడంపై విమర్శలు గుప్పించారు. సోమవారం వరంగల్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కూల్చడం తప్ప కట్టడం రాదని ధ్వజమెత్తారు. పేదల ఇళ్లతో పాటు దేవాలయాలను కూడా కూల్చుతున్నారని ఆరోపించారు. ఆ ప్రాంతంలో నిజంగా స్కూల్ నిర్మాణమే చేపడితే.. అర్ధరాత్రి పనులు చేయాల్సిన అవసరం ఏంటని హరీష్ రావు ప్రశ్నించారు. ఆలయాన్ని కూల్చివేసింది గుప్తనిధుల కోసమేనని.. పురాతన ఆలయాలను ఇందుకోసమే తవ్వుతున్నారేమోనన్న అనుమానాలు వస్తున్నాయన్నారు. ఆలయాన్ని కూల్చివేయడంపై పురావస్తుశాఖ ఫిర్యాదు చేసినా ఎలాంటి కేసు నమోదు చేయలేదని,

..మిగతా 2లో

# బండి భగీరథ్ కేసుపై సీఎం రేవంత్ సీరియస్

మొదటిపేజీ తరువాయి



ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. అలాగే ఈ కేసు పర్యవేక్షణ బాధ్యతలను కూకట్‌పల్లి డీసీపీ రుతురాజ్‌కు అప్పగించినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. దర్యాప్తు పూర్తిగా పారదర్శకంగా, వేగంగా జరగాలని ఉన్నతాధికారులు సూచించారు. ఇక కేసు వివరాల ప్రకారం, ఓ 17 ఏళ్ల బాలిక తల్లి తన కుమార్తెను భగీరథ్ వేధిస్తున్నాడని ఆరోపిస్తూ పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పోక్సో చట్టం సెక్షన్ 11, 12తో పాటు భారతీయ న్యాయ సంహిత (BNS) 74, 75 సెక్షన్ల కింద శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. కేసు నమోదు అనంతరం విచారణ ప్రారంభమైంది.

అదే సమయంలో భగీరథ్ కూడా పరస్పర ఫిర్యాదు చేశారు. తనను మరియు తన కుటుంబాన్ని డబ్బుల కోసం బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులు బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ కరీంనగర్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఇరు వర్గాలపై వేర్వేరు కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. ఈ కేసు సున్నితతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కూడా స్వయంగా స్పందించింది. కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి పోలీస్ కమిషనర్ నుంచి పూర్తి వివరాలు తీసుకున్నారు. కేసు విచారణను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేసినట్లు కమిషన్ ప్రకటించింది.

ప్రభుత్వ వర్గాల ప్రకారం, ఈ కేసులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు అవకాశం ఇవ్వకుండా పూర్తిస్థాయి నిష్పక్షపాత విచారణ జరగనుంది. ముఖ్యమంత్రి స్వయంగా కేసు పురోగతిని సమీక్షించనున్నట్లు సమాచారం. పోలీసు అధికారులు ఇప్పటికే సాక్ష్యాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఒకవైపు ఆరోపణలు, మరోవైపు ప్రతివాద ఫిర్యాదులు రావడంతో కేసు మరింత సంక్లిష్టంగా మారింది. అయితే చట్ట ప్రకారం విచారణ జరిపి నిజానిజాలు బయటపెడతామని పోలీసులు స్పష్టం చేశారు.

ప్రస్తుతం కేసు దర్యాప్తు కీలక దశలో ఉండగా, ఆధారాల సేకరణ, సాక్షుల విచారణపై పోలీసులు దృష్టి సారించారు. తదుపరి చర్యలు విచారణ నివేదిక ఆధారంగా తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

# భారత్ సత్తాకు సోమనాథ్ పునర్నిర్మాణమే నిదర్శనం

మొదటిపేజీ తరువాయి

అణు సత్తాను ప్రధాని ఈ వేదికపై నుంచి ప్రస్తావించారు. సరిగ్గా 1998 మే 11వ తేదీన పోఖ్రాన్‌లో భారత్ అణు పరీక్షలు నిర్వహించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో నిర్వహించిన ఆ పరీక్షల అనంతరం ప్రపంచ దేశాలు భారత్‌పై అనేక ఆంక్షలు విధించినా, వాటన్నింటినీ ఎదుర్కొని దేశం దృఢంగా నిలబడిందని మోదీ చెప్పారు. 1998 మే 13న మరిన్ని అణు పరీక్షలు జరిపి, భారత్ సత్తా ఏమిటో ప్రపంచానికి రుచి చూపించామని, మన దేశం ఎవరి ఒత్తిళ్లకు లొంగదని అప్పుడే నిరూపించామని ఆయన గర్వంగా ప్రకటించారు. ప్రాచీన వారసత్వాన్ని కాపాడుకుంటూనే, ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ భారత్ దూసుకుపోతోందని, అందుకే చంద్రయాన్ ప్రాజెక్టులో రోవర్ దిగిన చోటుకు 'శివశక్తి పాయింట్' అని పేరు పెట్టామని ఆయన వివరించారు. శివుడికి, చంద్రుడికి ఉన్న ఆధ్యాత్మిక బంధాన్ని సైన్స్ విజయంతో జోడించిన తీరును ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

సోమనాథ్ వేడుకల్లో భాగంగా ప్రధాని మోదీ అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమనాథ్ మహాదేవుడికి 'అభిషేకం', 'మహా పూజ' మరియు 'ధ్వజ పూజ' నిర్వహించిన అనంతరం ఆలయ పునర్నిర్మాణానికి నాంది పలికిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భారత వాయుసేనకు చెందిన 'సూర్యకిరణ్' టీమ్ సభ్యులు తమ యుద్ధ విమానాలతో చేసిన సాహసోపేత విన్యాసాలు భక్తులను, ప్రజలను మంత్రముగ్ధులను చేశాయి. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రధాని కుంభాభిషేక క్రతువులో కూడా పాల్గొన్నారు. 1951లో అప్పటి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించిన ఈ పునర్నిర్మిత ఆలయం నేడు 75 వసంతాలు పూర్తి చేసుకోవడం దేశ చరిత్రలో ఒక కీలక ఘట్టమని ప్రధాని ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.

అంతకుముందు సోమనాథ్ చేరుకున్న ప్రధాని



మోదీకి ప్రజలు నీరాజనాలు పట్టారు. హెలిప్యాడ్ నుంచి వీర్ హమీర్జీ సర్కిల్ వరకు సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల మేర సాగిన రోడ్‌షోలో లక్షలాది మంది ప్రజలు పాల్గొని మోదీ నామస్మరణతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు. దారిపొడవునా జాతీయ జెండాలు ఊపుతూ ప్రజలు ప్రధానిపై పూలవర్షం కురిపించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, ముఖ్యంగా బంగాల్‌కు చెందిన జానపద కళాకారులు తమ ప్రదర్శనలతో రోడ్‌షోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పవిత్రమైన ఈ క్షేత్రం సాక్షిగా భారత్ మరోసారి తన ఆధ్యాత్మిక మరియు భౌతిక సత్తాను ప్రపంచానికి చాటిచెబుతోందని, అభివృద్ధి పథంలో దేశం ఎవరికీ తలొగ్గకుండా ముందుకు సాగుతుందని ప్రధాని తన ప్రసంగం ద్వారా ప్రజల్లో దేశభక్తిని నింపారు. సోమనాథ్ ఆలయ అభివృద్ధిలో శివుడి ఆశీస్సులు ఉన్నాయని, దీని రూపురేఖలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్తామని ఆయన భరోసా ఇచ్చారు.

# యూరియా బఫర్ స్టాక్ సిద్ధం చేయాలి

మొదటిపేజీ తరువాయి



యూరియా బఫర్ స్టాక్‌తో పాటు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా, 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందన్నారు. రాష్ట్రంలోనే ఉన్న రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో కనీసం 90 శాతం తెలంగాణ అవసరాలకే కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వనరులను వినియోగించి ఇక్కడే ఉత్పత్తి జరుగుతున్న యూరియా, రాష్ట్ర రైతులకు అవసరమైన సమయంలో అందకపోవడం అన్యాయమన్నారు. ఈ అంశంపై రామగుండం ఎరువుల కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు.

గత నెలలో కేటాయింపుల మేరకు సరఫరా చేయని కంపెనీలు, మిగిలిన పరిమాణంతో పాటు ఈ నెల కోటాను కూడా సమయానికి సరఫరా చేయాలని ఆదేశించారు. రేక్ పాయింట్లకు చేరిన యూరియాను జిల్లాలకు తరలించే ప్రక్రియలో ఎటువంటి జాప్యం జరగకూడదని, హ్యాండ్లింగ్, రవాణాలో నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులను హోల్‌సేల్, రిటైల్ లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. యూరియా యాప్ ను మార్గదర్శకంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎరువులను అందించేందుకు ఒక సరికొత్త యాప్‌ను తీసుకువస్తుందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలోని రెండు జిల్లాలలో ఈ యాప్ ను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. మన రాష్ట్రంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలో ఈ యాప్ ను అమలు చేయనున్నారని తెలిపారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వాడుతున్న రైతుల అనుభవాలను వీడియో రూపంలో చిత్రీకరించి రైతు నేస్తం కార్యక్రమంలో ప్రసారం చేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరారు. రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించాలని, యూరియాను అధికంగా వినియోగిస్తే భూసారం దెబ్బతిని, భవిష్యత్తులో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో ఏపీసీ సురేంద్ర మోహన్, అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్ డిజిటల్ వింగ్ డైరెక్టర్ సరితా లక్ష్మీ, వ్యవసాయశాఖ డైరెక్టర్ డా. గోపి, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బండి భగీరథ్ కేసుతో బీజేపీకి సంబంధం లేదు

మొదటిపేజీ తరువాయి

జరిగిన విషయం మాత్రమే. పార్టీకి దీనితో సంబంధం లేదు” అని ఆయన స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని, ఎవరికీ ప్రత్యేక రక్షణ ఉండదని వ్యాఖ్యానించారు.

ఈ కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలని బీజేపీ కోరుకుంటుందని ఆయన తెలిపారు. అవసరమైతే బండి సంజయ్ కుటుంబ సభ్యులపై కూడా విచారణ జరపాలని సూచించారు. “విచారణకు ఎవరూ అతీతులు కారు. సాక్ష్యాల ఆధారంగా చట్టం నిర్ణయం తీసుకుంటుంది” అని ఆయన అన్నారు. రాజకీయంగా ఈ కేసును వాడుకోవద్దని ఆయన సూచించారు. కేసును పార్టీతో ముడిపెట్టడం తగదని, వ్యక్తిగత ఆరోపణలను రాజకీయ రంగు ఇవ్వడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలను నిరాకరించారు.

అదే సమయంలో చట్టపరమైన ప్రక్రియపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తూ, పోలీసులు స్వతంత్రంగా విచారణ జరపాలని ఆయన అన్నారు. “చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఎవరు తప్పు చేసినా చట్టం ముందు సమానమే” అని రామచందర్‌రావు స్పష్టం చేశారు. ఈ కేసు ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో, బీజేపీ తరపున ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీకి సంబంధం లేదని, ఇది పూర్తిగా వ్యక్తిగత పరిధిలోని అంశమని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో, అన్ని వర్గాలు పోలీసుల విచారణకు సహకరించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజ్ఞప్తి చేశారు. నిజానిజాలు బయటపడిన తరువాతే ఏదైనా నిర్ణయానికి రావాలని ఆయన సూచించారు.



# గుప్తనిధుల కోసమే 800 ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయాన్ని కూల్చారా?

మొదటిపేజీ తరువాయి



దీని వెనుక ఏదో కుట్ర ఉన్నట్లుగా తెలుస్తోందన్నారు. కూల్చిన ఆలయం గర్భగుడి కింద 24 అడుగుల గొయ్యి తవ్వారని, అక్కడ నిధులేమైనా దొరికితే ఎత్తుకెళ్లి ఉండొచ్చని ఆరోపించారు. అక్కడ గొయ్యి తవ్వినట్లు పురావస్తుశాఖ అధికారులే గుర్తించారన్నారు. రేవంత్ రెడ్డి లంకె బిందెల వేటలోనే ఈ దేవాలయాన్ని కూల్చారన్నారు. సరిగ్గా విగ్రహం ఉన్న చోటే తవ్వకాలు ఎందుకు జరిపారని ప్రశ్నించారు.

ఈ సందర్భంగా ఆలయం కూల్చివేతపై హరీష్ రావు కొన్ని డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. పురావస్తుశాఖ ఇచ్చిన కంప్లైంట్ ఆధారంగా తక్షణమే ఆలయం కూల్చివేతపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, ఆలయాన్ని కూల్చివేసిన వారిని అరెస్ట్ చేయాలని ఈ సందర్భంగా హరీష్‌రావు డిమాండ్ చేశారు. యుద్ధ ప్రాతిపదికన ఆ దేవాలయాన్ని పునరుద్ధరించాలని, 1958 పురావస్తు శాఖ చట్ట ప్రకారం వందేళ్లకు పైబడిన ఏ ఆలయం అయినా, దానికి సంబంధించినవైనా పురావస్తుశాఖ పరిధిలోకి వస్తుందని దాన్ని వెంటనే ఆ శాఖ అప్పగించాలని కూడా డిమాండ్లలో పేర్కొన్నారు. అర్ధరాత్రి జరిపిన తవ్వకాల్లో గుప్తనిధులు బయటపడితే.. అవి ఎవరి ఇళ్లలోకి పోయాయో విచారణ జరిపించి నిజానిజాలు బయటపెట్టాలని కోరారు. తమ పాలనలో కాకతీయుల గొప్పతనాన్ని ప్రపంచం గుర్తించేలా చేస్తే.. రేవంత్ సర్కార్ అదే కాకతీయుల గొప్పతనాన్ని కూల్చివేసిందని దుయ్యబట్టారు.

# తెలంగాణకు ఏం ఇచ్చారు?

మొదటిపేజీ తరువాయి



విస్మరించడమేనని మండిపడ్డారు. బీసీల అభివృద్ధికి కులగణన అత్యవసరమని, కేంద్రం ఈ విషయంలో వివక్ష చూపుతోందని ఆయన విమర్శించారు.

తెలంగాణపై కేంద్రం చూపుతున్న వివక్షపై స్పందించాలని రాష్ట్ర బీజేపీ నేతలకు మంత్రి సవాల్ విసిరారు. గత 12 ఏళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చిన నిధులపై సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద లేదా మరెక్కడైనా సరే బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్న కేంద్రం, తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనపై స్పందిస్తూ, "రాష్ట్రానికి ఏం ప్రాజెక్టులు ఇస్తారో చెప్పకుండా, బంగారం కొనొద్దు అని సలహాలు ఇవ్వడానికే మోదీ వచ్చారా?" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అనేకసార్లు కేంద్ర మంత్రులను కలిసి విన్నవించినా నిధుల విడుదలపై స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాముడిని తాము కూడా పూజిస్తామని, అయితే బీజేపీలాగా ఓట్ల కోసం దేవుడిని వాడుకోమని స్పష్టం చేశారు.

# మెడిసిన్ రవాణాకోసం స్పెషల్ ట్రైన్

మొదటిపేజీ తరువాయి

కేటాయించడం గర్వంగా ఉందన్నారు. సోమవారం ప్రధాని మోడీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా పేర్కొంటూ ప్రత్యేక రీఫర్ రైలును ప్రారంభించడం హైదరాబాద్ ఫార్మా కంపెనీలకు చాలా మేలు జరగడంతో పాటు దేశవ్యాప్తంగా, వివిధ దేశాలకు సరైన సమయంలో ఔషధాలను చేరవేసేందుకు వీలు కలుగుతుంది. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియా, పటాన్‌చెరులోని ఫార్మా జోన్, ముచ్చర్లలోని ఫ్యూచర్ సిటీ తదితర ప్రాంతాల్లో ఉత్పత్తయ్యే ఫార్మా ప్రొడక్ట్స్ సరఫరాకు ఈ రైలు చాలా కీలకం కానుంది.

ఫ్రీజర్ ఫెసిలిటీ లేకపోతే చాలా వరకు లైఫ్ సేవింగ్ డ్రగ్స్ నాణ్యత తగ్గుతుందని, హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో తయారయ్యే మందులను వాటి నాణ్యత తగ్గకుండా సరఫరా చేయాలనేది మోదీ సర్కారు సంకల్పమన్నారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో నడుస్తున్న సనత్ నగర్ లోని ఇన్ ల్యాండ్ కంటైనర్ డిపో నుండి ఈ ప్రత్యేక రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఔషధి ఎక్స్‌ప్రెస్’గా నామకరణం చేసిన ఈ రెఫ్రిజిరేటర్ రైలు ద్వారా లైఫ్ సేవింగ్ మందులతో పాటు అవసరమైన ఇతర సరుకులను కూడా రవాణా చేయనున్నారు. కంటిన్యూయస్ రిఫ్రిజిరేషన్ ఉండేందుకు డీజిల్ పవర్ ప్యాక్‌లతో కూడిన అధునాతన రీఫర్ కంటైనర్లను వినియోగిస్తున్నారు. ఇది మన కోల్డ్‌చైన్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటుగా మన ఫార్మాసూటికల్స్ సప్లయ్ చైన్ కెపాసిటీని పెంచేందుకు కీలకమైన ముందడుగు కానుంది. ప్రస్తుతానికి వారానికి ఒకసారి నడుస్తున్న ఈ ‘ఔషధి ఎక్స్‌ప్రెస్ డిమాండ్, వాణిజ్య వర్గాల అవసరాలకు అనుగుణంగా వారానికి రెండుసార్లు నడిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇన్నొవేషన్ బేస్డ్ సొల్యూషన్స్ తీసుకురావడంలో మోడీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త అవకాశాలకు ప్రోత్సాహాన్ని అందిస్తోంది.




# నూతన ట్రాన్స్‌ఫర్మార్ ప్రారంభించిన సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహా

- ప్రొద్దుటూరులోని ఏళ్ల కరెంట్ సమస్యకు పరిష్కారం

**శంకర్ పల్లి మే 11(ప్రజాక్షేత్రం):**

శంకర్ పల్లి మండలం ప్రొద్దుటూరు గ్రామంలో 10వ వార్డులో సోమవారం నూతన ట్రాన్స్‌ఫర్మార్ ను గ్రామ సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహా ప్రారంభించారు. ఈ వార్డు ప్రజలు గత కొన్ని ఏళ్ళుగా కరెంటు లోవోల్టేజ్ సమస్యలో బాధపడుతున్న ఆ సమస్యకు పరిష్కారం లభించలేదు కానీ ఇప్పుడు నూతనంగా స్థానిక ప్రజల కోరిక మేరకు సర్పంచ్ బండ లక్ష్మి నర్సింహా వద్దకు ఈ సమస్యను తీసుకపోవడంతో, ఆమె వెంటనే స్పందించి, నూతన ట్రాన్స్ఫర్మార్ ఏర్పాటు చేయడం సంతోషాన్ని కలుగచేసిందని, తన వార్డు అభివృద్ధికి నేనెపుడు ముందుంటానని అన్ని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కావేలి తిరుపతి రెడ్డి లైన్మెన్ వెంకటేష్, నాని ప్రభాకర్, మందుముల నర్సిములు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రమాద బాధితుడికి మొకిలా సీఐ సాయం

**శంకర్ పల్లి మే 11(ప్రజాక్షేత్రం):**

నార్సింగ్ పరిధిలోని మేఖానడ్డ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తు తెలియని వ్యక్తిని ఆసుపత్రికి తరలించి మొకిలా పోలీస్ స్టేషన్ సిఐ శ్రీనివాస్ మానవత్వం చాటుకున్నారు. సోమవారం పోలీస్ స్టేషన్కు వెళ్తున్న సమయంలో రోడ్డుపై ప్రమాదానికి గురై గాయాలతో పడిఉన్న వ్యక్తిని ఆయన గమనించారు. వెంటనే తనతో ఉన్న కానిస్టేబుల్ నరేందర్ సహాయంతో గాయపడిన వ్యక్తిని ఆటో ద్వారా నార్సింగ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రజాక్షేత్రం
తెలుగు దినపత్రిక
12.05.2026
మంగళవారం | హైదరాబాద్

# చిన్న పత్రికల సంక్షేమానికి అండగా ఉంటాం

- అక్రిడిటేషన్ కమిటీ సభ్యులకు ఘన సన్మానం
- సీఏ సర్టిఫికెట్ సమస్య పరిష్కారానికి కృషి
- మంత్రి, కమిషనర్ లతో పాటు చైర్మన్ దృష్టికి మీ సమస్యలు తీసుకెళ్లాం:విరాహత్ అలీ

**హైదరాబాద్ మే 11(ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్ చిన్న, మధ్య తరహా పత్రికలు, మ్యాగజైన్స్ ఎడిటర్ల సంక్షేమం కోసం తమ యూనియన్ తల్లిలా అండగా ఉంటుందని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ పేర్కొన్నారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీలకు చిన్న, మధ్య తరహా పత్రికల నుంచి సభ్యులుగా నియమితులైన వారిని తెలంగాణ స్మాల్ మీడియం న్యూస్ పేపర్స్ అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు యూసుఫ్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విరాహత్ అలీ మాట్లాడుతూ.. చిన్న పత్రికల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని చెప్పారు.

చిన్న మధ్య తరహా ప్రతికల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ ముకుంద్ రెడ్డిలతో పాటు మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఆయన వివరించారు. అక్రిడిటేషన్ల జారీలో ఇబ్బందిగా మారిన సీఏ సర్టిఫికెట్ నిబంధనపై సమాచార శాఖ కమిషనర్‌తో చర్చించామని, త్వరలోనే ఈ సమస్య తొలిగిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.పెండింగ్ బిల్స్, ప్రతినెలా జారీ చేసే ప్రకటనల విషయంలో సమాచార శాఖ మంత్రి, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేద్దామని విరాహత్ అలీ అన్నారు. కమిటీ సభ్యులుగా ఎంపికైన వారు క్షేత్రస్థాయిలో పోరాడి అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు వచ్చేలా చూడాలని సూచించారు. పత్రికల ప్రకటనల పెండింగ్ బిల్లులు త్వరగా విడుదలయ్యేలా ప్రయత్నిస్తున్నామని, ఐకమత్యంతోనే హక్కులను సాధించుకోగలమని పిలుపునిచ్చారు. అనంతరం అక్రెడిటేషన్ కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించారు.



**యూనియన్ లో చేరిన అగస్టిన్**

ఈ కార్యక్రమంలో 'వుదయం' దినపత్రిక ఎడిటర్ అగస్టిన్ తిరిగి యూనియన్‌లో చేరగా, ఆయనను విరాహత్ అలీ సాదరంగా ఆహ్వానించి సభ్యత్వాన్ని ఇచ్చారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అశోక్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల సమన్వయకర్త బాలరాజు నేతృత్వంలో జరిగిన ఈ సన్మాన సభలో టియుడబ్ల్యుజె రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైజల్, మధు గౌడ్, హెచ్‌యూజే అధ్యక్షుడు శంకర్, చిన్న పత్రికల సంఘం కోశాధికారి ఆజంఖాన్, రాజిరెడ్డి, దయానంద్, అల్వాల్ హన్మంతు, ఎస్ ఎస్ కె హుస్సేన్, మాతంగి దాస్, దైవాదీనం, బాలకృష్ణ, గోల్ల రమేష్, ఆమన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల నుండి కలెక్టరేట్ కార్యాలయానికి బస్సులు నడపాలి.

- సబర్బన్ సిటీ బస్సులలో జనరల్ పాస్ డే పాస్ పరిధిని చేవెళ్ల వరకు అనుమతించాలి.
- పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖానాపురం రాజేష్ డిమాండ్.

**చేవెళ్ల మే 11(ప్రజాక్షేత్రం):**

చేవెళ్ల నుండి రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్ లోని కలెక్టరేట్ కార్యాలయం వరకు రోజుకు నాలుగు బస్సులు నడపాలని చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రగతి శిలా ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ చేవెళ్ల, శంకర్ పల్లి, షాబాద్, మొయినాబాద్, మండలాల, గ్రామాల ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడానికి, లేదా పరిష్కరించుకోవడం కోసం కలెక్టరేట్ కి వెళ్లామంటే సరైన రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందరికీ అందుబాటులో ఉండాల్సిన కలెక్టరేట్ కార్యాలయం అడవిలో ఉన్నది కాబట్టి అక్కడికి వెళ్లడానికి సరైన రవాణా సౌకర్యం లేదు ప్రజలకు విద్యార్థులకు ఉద్యోగులకు ఇబ్బంది గా ఉంది. పేద ప్రజలు ఏదైనా సమస్య ఉంటే కలెక్టరేట్ కి వెళ్లడానికి కూడా ఎలా వెళ్లాలని అర్థం కాని పరిస్థితి ఉంది. కాబట్టి చేవెళ్ల నుండి కలెక్టరేట్ కి ఉదయం నుండి సాయంత్రం వరకు నాలుగు బస్సులు వెళ్లేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) గా డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు. అదేవిధంగా సిటీ సబర్బన్ బస్సులలో జనరల్ పాస్ మరియు డే పాస్ ని తొల్కట్ట గెట్ వరకు మాత్రమే చెల్లుబాటు అవుతుంది. దానిని చేవెళ్ల వరకు అనుమతించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు నాయకులు బొజ్జి శ్రీకాంత్, న్యాలట అశోక్, పిడిఎస్ యు షాబాద్ మండల అధ్యక్షుడు అనిల్ ఉన్నారు.



## బండి భగీరథ్‌పై పోక్సో కేసు.. విచారణకు సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆదేశాలు!

**హైదరాబాద్ మే 11(ప్రజాక్షేత్రం):**

కేంద్రమంత్రి బండి సంజయ్ తనయుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారింది. ఈ వ్యవహారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత వేగంగా స్పందించారు. ఈనెల 8వ తేదీనే ఫిర్యాదు అందినప్పటికీ, ఇంతవరకు చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరిగిందని డీజీపీ సీవీ ఆనంద్‌ను సీఎం సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లలో సిబ్బంది నిమగ్నమై ఉండటం వల్లే ఆలస్యమైందని డీజీపీ వివరణ ఇవ్వగా, దీనిపై ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని సీఎం ఆదేశించారు. కేసు తీవ్రత దృష్ట్యా ప్రత్యేక విచారణ బృందాలను ఏర్పాటు చేసి నివేదిక సమర్పించాలని డీజీపీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు, ఈ కేసులో పరస్పర ఫిర్యాదులు కలకలం రేపుతున్నాయి. తన 17 ఏళ్ల కుమార్తెను భగీరథ్ వేధిస్తున్నారంటూ ఓ తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పేట్‌బషీరాబాద్ పోలీసులు పోక్సో చట్టం మరియు బీఎన్ఎస్



సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే, ఇది తనపై జరుగుతున్న కుట్ర అని, సదరు బాలిక కుటుంబం తనను డబ్బుల కోసం బెదిరిస్తోందని భగీరథ్ కరీంనగర్ పోలీసులను ఆశ్రయించడంతో అక్కడ కూడా కేసు నమోదైంది. ఈ సున్నితమైన అంశంపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కూడా రంగంలోకి దిగింది. కమిషన్ ఛైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి పోలీసుల నుంచి పూర్తి వివరాలను తెప్పించుకోవడమే కాకుండా, విచారణ కోసం ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

## హేమాద్రి దేవస్థాన చైర్మన్‌కు ఘన సన్మానం

- హేమాద్రి దేవస్థాన చైర్మన్‌కు ఘన సన్మానం

**కీసర, మే 11(ప్రజా క్షేత్రం):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కీసర మండలం కీసర దయార హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన దేవస్థాన చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డిని సామాజిక సేవా కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కీసర గ్రామపంచాయతీ మాజీ వార్డ్ సభ్యుడు తుడుం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం భక్తి, ఆనందోత్సాహాల నడుమ జరిగింది. ఈ సందర్భంగా తుడుం శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు పొందేలా హేమాద్రి శ్రీ వెంకటేశ్వర స్వామి పునర్నిర్మాణ మహోత్సవాలను నిర్వహించడం వెనుక చైర్మన్ కందాడి హనుమంత్ రెడ్డి పట్టుదల, కమిటీ సభ్యుల కృషి కీలకమని అన్నారు. ఆలయ పునర్నిర్మాణం భక్తుల విశ్వాసాలను మరింత బలపరిచే ఆధ్యాత్మిక యజ్ఞంగా నిలిచిందని పేర్కొన్నారు. పునర్నిర్మాణ కార్యక్రమం ప్రారంభం నుంచి మహోత్సవాల ముగింపు వరకు ప్రతి అంశాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయడం, వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించడం, వేలాది మంది భక్తులకు సదుపాయాలు కల్పించడం కమిటీ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని చైర్మన్‌కు అభినందనలు తెలిపారు.



## పోక్సో కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోంది:వివేకానంద్

- బీజేపీ–కాంగ్రెస్ చీకటి ఒప్పందాలు బయటపెడతాం:కేపీ వివేకానంద్
- ఉన్నోడికి ఒక న్యాయం..పేదోడికి మరో న్యాయమా..?:కేపీ వివేకానంద్
- బండి సంజయ్‌పై ఎఫ్ఐఆర్‌లో పేరు చేర్చాలి:వివేకానంద్
- మైనర్ కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలి:ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

**కుత్బుల్లాపూర్, మే 11(ప్రజాక్షేత్రం):**

జగద్గిరిగుట్ట కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలంటే బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి వివేకానంద డిమాండ్ చేశారు. కేసు నమోదై మూడు రోజులు గడిచినా ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు, అధికార దుర్వినియోగం స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన ఆరోపించారు. జగద్గిరిగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన, రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర హోంశాఖ వ్యవస్థ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని తీవ్ర విమర్శలు గుప్పించారు. "మైనర్ బాలికకు సంబంధించిన పోక్సో కేసులో సాధారణ వ్యక్తి అయితే వెంటనే అరెస్టు చేసేవారు. కానీ అధికార పార్టీలకు చెందిన వారిపై మాత్రం చట్టం వేరేలా పనిచేస్తోంది. ఇదేనా న్యాయం?" అని ప్రశ్నించారు.

బండి సంజయ్ రాజకీయ ప్రస్థానంపై కూడా వివేకానంద్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "2018కి ముందు రాజకీయ భవిష్యత్తు కోసం చందాలు వసూలు చేసిన వ్యక్తికి నేడు వందల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి? ప్రజలకు సమాధానం చెప్పాలి" అన్నారు. ధర్మం, దేశభక్తి పేరుతో రాజకీయ బ్లాక్‌మెయిల్ చేస్తూ, కాంగ్రెస్‌తో చీకటి ఒప్పందాలు చేసుకుంటూ బీజేపీని తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. మైనర్ బాలికపై హనీ ట్రాప్ కేసు నమోదు చేయడం ద్వారానే అధికార దుర్వినియోగం బయటపడుతోందని పేర్కొంటూ, "18 ఏళ్ల లోపు బాలికపై హనీ ట్రాప్ సెక్షన్లు వర్తించవు. అయినా కేసును మళ్లించే ప్రయత్నం జరుగుతోంది" అన్నారు. బండి సంజయ్ కుమారుడు బాలికతో కలిసి తిరిగినట్లు, పార్టీలకు వెళ్లినట్లు స్వయంగా ఒప్పుకున్నాడని తెలిపారు.

"పోక్సో కేసును నీరుగార్చేందుకు బాధిత కుటుంబాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. అందుకే ఈ కేసు ఎఫ్ఐఆర్‌లో బండి సంజయ్ పేరును కూడా చేర్చాలి" అని డిమాండ్ చేశారు. "దేశం, ధర్మం మీద గౌరవం ఉంటే బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలి. లేదంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆయన్ను వెంటనే బర్తరఫ్ చేయాలి. ఉన్నోడికి ఒక న్యాయం, పేదోడికి ఒక న్యాయమా అనే పరిస్థితి ప్రజల్లో కనిపిస్తోంది" అని అన్నారు. బాలిక కుటుంబానికి న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్ పార్టీ బాధితుల పక్షాన అండగా ఉంటుందని స్పష్టం చేశారు. "ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ అన్నట్టుగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాజకీయ నాటకాలు ఆడుతున్నాయి. వీటి అసలు రూపాన్ని త్వరలోనే ప్రజల ముందుకు తీసుకొస్తాం" అని హెచ్చరించారు.



## రైతు చెమటకు సరైన విలువ దక్కాలి

- జనగాం గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ సంజమొల్ల అరుణ

**పెద్దేముల్, మే 11(ప్రజాక్షేత్రం):**

రైతుల చెమటకు సరైన విలువ దక్కినపుడే రైతులు సంతోష పడతారని జనగాం గ్రామ సర్పంచ్ సంజమొల్ల అరుణ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల పరిధిలోని జనగాం గ్రామంలో రైతులు, అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్తులతో కలిసి నూతనంగా వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జనగాం గ్రామ సర్పంచ్ సంజమొల్ల అరుణ మాట్లాడుతూ... రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ అధికారులు, మాజీ సర్పంచ్ నర్సిములు, మాజీ ఉప సర్పంచ్ శివకుమార్, వార్డు సభ్యులు కుంటిగాల్ల ఆనంతయ్య, నాయకులు పుల్లమొళ్ల సంజీవ్ కుమార్, రవీందర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, తోగిర్స రాజు, గ్రామస్థులు సంజమొల్ల రాములు, గోపాల్, నర్సిములు, బాలప్ప, మల్లప్ప, అంతప్ప, బంటు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదలకు ఇండ్లు ఇచ్చింది,ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

**పెద్దేముల్, మే 11(ప్రజాక్షేత్రం):**

నిరుపేదలకు ఇండ్లు ఇచ్చింది ఇచ్చేది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమేనని పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి.మహిపాల్ రెడ్డి,కోట్ పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాయిని నారాయణరెడ్డి,జనగాం గ్రామ సర్పంచ్ ఎస్.అరుణలు అన్నారు.సోమవారం పెద్దేముల్ మండలంలో పరిధిలోని జనగాం గ్రామానికి చెందిన సంపంగి అనంతమ్మ గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై అనంతమ్మ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు .ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ........ నిరుపేదల ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.తాండూరు నియోజకవర్గంలో ఎక్కువ మొత్తంలో ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయించి నిరుపేద ప్రజల సొంతింటి కలను నెరవేరుస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆరు గ్యారంటీలు, ఇతర సంక్షేమ పథకాలు దశలవారీగా అమలవుతున్నాయని అన్నారు. కొత్త ఇంటిలో సంపంగి అనంతమ్మ కుటుంబ సభ్యులకు ఆనందం, ఐశ్వర్యం నెలకొని కుటుంబ సభ్యులు సుఖ:శాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిని శ్రీనివాస్ రెడ్డి, శివకుమార్, సంజీవ్ కుమార్, రాజు, కుంటిగళ్ల అంతప్ప, బాలప్ప, చుక్క గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## మిల్లుల్లో ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలి

- రానున్న 15 రోజులు కీలకం:కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ కలెక్టరేట్, మే 11(ప్రజాక్షేత్రం):**

ధాన్యం కేటాయించిన రైస్ మిల్లుల్లో దిగుమతి ప్రక్రియను వేగవంతం చేసి కొనుగోళ్లకు మరింత ఊపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, రైస్ మిల్లర్లు, రవాణా సంఘాల ప్రతినిధులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని, దీంతో కొనుగోలు, రవాణా ప్రక్రియ సజావుగా సాగుతుందని తెలిపారు. అధికారులు, మిల్లర్లు, రవాణాదారుల సమన్వయంతోనే కొనుగోళ్ల ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయగలమన్నారు. కొనుగోళ్ల వేగం పెంచేందుకు మిల్లర్లు అవసరమైన మేర హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రానున్న రెండు వారాలు కీలకమని, ఈ సమయంలో పెద్దఎత్తున ధాన్యం సేకరణ జరగనున్నందున అందరూ ముందస్తుగా సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారులు కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, జిల్లా మేనేజర్ రజనీకాంత్, డీఆర్‌డీఓ శ్రీధర్, డీసీఓ రామానుజాచారి తదితరులు పాల్గొన్నారు.



## ఏసీబీ వలకి చిక్కిన కొమురవెల్లి పంచాయతీ కార్యదర్శి

- రూ. 10 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ అధికారి
- సర్పంచ్ భర్త కూడా అరెస్టు.. సిద్దిపేట జిల్లాలో కలకలం




**సిద్దిపేట జిల్లా మే 11(ప్రజాక్షేత్రం):**

కొమురవెల్లి మండల కేంద్రంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడి నిర్వహించారు. లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి మరియు సర్పంచ్ భర్త ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. కొమురవెల్లి గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుడి ప్లాట్‌లో గ్రామ పంచాయతీ వారు డ్రైనేజీ పైప్‌లైన్ వేశారు. ఆ పైప్‌లైన్‌ను అక్కడ నుంచి తొలగించాలనే అధికారిక పని కోసం పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజు గౌడ్ పది వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో సోమవారం పక్కా ప్రణాళికతో అధికారులు నిఘా పెట్టారు.

## గాజులరామారంలో అపార్ట్మెంట్‌లో అగ్నిప్రమాదం

**కుత్బుల్లాపూర్, మే 11(ప్రజాక్షేత్రం)**



జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని గాజులరామారం కైలాస్ హిల్స్ ప్రాంతంలోని ఓ అపార్ట్మెంట్‌లో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అపార్ట్మెంట్ రెండవ అంతస్తులో ఉన్న ఫ్లాట్‌లో గీజర్ పేలడంతో భారీ శబ్దంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. అనంతరం మంటలు సెకండ్ ఫ్లోర్‌లోని మొత్తం ఫ్లాట్‌కు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపు చేశారు ఎలాంటి ప్రాణనష్టం లేదు ఆస్తి నష్టం జరిగింది కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆశా వర్కర్ల బకాయిలు విడుదల చేయాలి

**కాప్రా, మే 11(ప్రజా క్షేత్రం):**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఆశా వర్కర్లకు మార్చి, ఏప్రిల్ నెలల పెండింగ్ పారితోషికాలను వెంటనే విడుదల చేసి, రూ.18 వేల ఫిక్స్డ్ వేతనం అమలు చేయాలని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్రం పెంచిన రూ.1,500 అదనపు పారితోషికాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, 2021 పీఆర్‌సీ ఎరియర్స్‌తో పాటు వివిధ డ్యూటీల పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## హౌసింగ్ సర్వే పరిశీలించిన తహశీల్దార్ రాజశేఖర్

- ప్రభుత్వ గృహ పథకాల లబ్ధి నిజమైన అర్హులకు చేరాలి

**పెద్ద కొడప్‌గల్ మే 11(ప్రజాక్షేత్రం):**

పెద్ద కొడప్‌గల్ మండలం వడ్లం గ్రామంలో జరుగుతున్న హౌసింగ్ సర్వేను తహశీల్దార్ రాజశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి సర్వే ప్రక్రియను పరిశీలిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అర్హుల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పథకాల లబ్ధి నిజమైన అర్హులకు చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. సర్వేలో పారదర్శకత పాటించి ప్రతి కుటుంబ పరిస్థితిని సరిగ్గా నమోదు చేయాలని సూచించారు. ఎవరైనా అర్హులు మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించి సరైన వివరాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలంటే ప్రజలు నిజమైన సమాచారాన్ని అందించాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రాజశేఖర్ తెలిపారు.



# సమ్మర్ క్యాంపుతో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు

- పీఎంశ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం
- ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన పెద్దేముల్ మండల విద్యాధికారి నర్సింగ్ రావు
- విద్యార్థులు ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- తల్లిదండ్రులు విద్యార్థులను సమ్మర్ క్యాంపులో చేర్పించేలా చొరవ చూపాలి
- బలహీన బాల్యం వద్దు
- బలిష్టమైన బాల్యం ముద్దు
- సమ్మర్ క్యాంప్ నిర్వహణతో విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుంది
- పెద్దేముల్ మండల ఎంపీడీఓ కే.తిరుమల స్వామి, ఎంఈఓ నర్సింగ్ రావు






**పెద్దేముల్, మే 11(ప్రజాక్షేత్రం):**

ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని పెద్దేముల్ మండల ఎంపీడీఓ కే.తిరుమల స్వామి, ఎంఈఓ నర్సింగ్ రావులు అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ,విద్యాశాఖ, జిల్లా విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పెద్దేముల్ మండల ఎంపీడీఓ కే.తిరుమల స్వామి,ఎంఈఓ నర్సింగ్ రావులు మాట్లాడుతూ...వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా అనవసరమైన విషయాలకు దూరంగా ఉంటూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాల్లో చేరి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యచరణ ప్రణాళిక) లో భాగంగా ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను పెద్దేముల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలతోపాటు గొట్లపల్లి మోడల్ స్కూల్ లో ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఈ నెల 11 నుండి 25 వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని కొనసాగించి 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పలు అంశాలలో నిపుణుల ద్వారా ఉచిత శిక్షణను ఇవ్వడం జరుగుతుందని అన్నారు.అదేవిధంగా ఈనెల 11 నుంచి 17 వరకు విద్యా వారోత్సవాలను కూడా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు కుట్టు పని/అల్లికలు, సంగీతం /శాస్త్రీయ నృత్యం, డ్రాయింగ్/ కథలు చెప్పడం, వ్యక్తిత్వ వికాసం, ఇండోర్ గేమ్స్, చదరంగం, గణిత శాస్త్రము మెలకువలు, మోడలింగ్, టిఎల్ఎం తయారీ, సైన్స్ ప్రయోగాలు, క్రీడలు మరియు ఆటలు, క్విజ్ పోటీలు, మాకు పార్లమెంట్ కార్యకలాపాలు, తెలుగు,హిందీ భాషల ప్రాధాన్యత గురించి స్థానిక అవసరాలకు అనుగుణంగా ఇతర కార్యక్రమాలను ప్రతిరోజు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.శిక్షణ శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు ప్రతిరోజు స్నాక్స్ అందించడం జరుగుతుందని, లర్నింగ్ మెటీరియల్ స్పోర్ట్స్ మెటీరియల్ అందుబాటులో ఉంచి విద్యార్థుల్లో వివిధ రకాల సామర్థ్యాలను, నైపుణ్యాలను, వివిధ రంగాల్లో సృజనాత్మకతను వెలికితీయడం జరుగుతుందని అన్నారు.వేసవి శిక్షణ శిబిరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 100 మంది విద్యార్థులను గరిష్టంగా ఈ సమ్మర్ క్యాంపులో రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించి ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులను చేర్పించి విద్యార్థుల విద్యాభివృద్ధి, సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు.పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం,ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఇంచార్జి శ్రీమతి సునీత మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ప్రభుత్వం విద్యార్థులకు గొప్ప అవకాశం కల్పించి ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులను ఆహ్వానిస్తుందని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు అనవసరమైన విషయాల జోలికి పోకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని అన్నారు.విద్యార్థులు బాల్య దశలో 15 సంవత్సరాల లోపు వయస్సులో నేర్చుకున్న విషయాలు జీవితంలో స్థిరంగా ఉండిపోతాయని అన్నారు. ప్రస్తుత సమాజంలో బలహీన బాల్యం కంటే బలిష్టమైన బాల్యం సమాజానికి అవసరమని ఆ దిశగా విద్యార్థులు ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ నర్సింహులు ఆర్ట్ క్రాఫ్ట్ మాస్టర్ టి.గోపాల్, కరాటే మాస్టర్ ఏ.గోపాల్, డాన్స్ మాస్టర్ నరేష్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ కృష్ణ, అటెండర్ గురవప్ప, విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుకు రశీదు కేంద్రంలోనే ఇవ్వాలి

- లారీ మిల్లుకు వెళ్లాక తరుగు మాటే వద్దు
- మంత్రి జూపల్లి కృష్ణారావు

**వనపర్తి, మే 11(ప్రజాక్షేత్రం):**

రైతులు పండించిన వడ్లను అమ్ముకోవడానికి ఎవరిని బతిమాలుకోవాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి గింజను మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు పూర్తి భరోసా కల్పిస్తామని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు, మిల్లర్లకు నష్టం కలగకుండా పారదర్శకంగా ధాన్యం సేకరణ జరపాలని, అక్కడే తూకం వేసి రైతుకు రశీదు అందజేయాలని అధికారులకు ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కల్యాణసాయి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో యాసంగి సీజన్ వరి, మొక్కజొన్న కొనుగోళ్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. సమావేశంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు.

రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రైతులు, కొనుగోలుదారులు, రైస్‌మిల్లర్లు సమన్వయంతో వ్యవహరించాలని, ఎక్కడా పారదర్శకత లోపించకూడదని సూచించారు. రైతు కష్టానికి తగిన ప్రతిఫలం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కొనుగోలు కేంద్రంలోనే వడ్ల నాణ్యత పరిశీలించి తూకం వేసి రైతుకు రశీదు ఇవ్వాలని, లారీ వెంబడి రైతు మిల్లుకు వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వడ్ల నాణ్యత ఆధారంగా తరుగు కేంద్రంలోనే నిర్ణయించాలని, మిల్లుకు చేరిన తర్వాత తరుగు పేరుతో ఇబ్బందులు పెట్టొద్దని మిల్లర్లకు సూచించారు.

ఈ సందర్భంగా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన వడ్లు రాకపోవడం వల్ల మిల్లర్లు నష్టపోతున్నారని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి, ఎఫ్‌సీఐకి ఇచ్చే బియ్యంలో నూకలు, గింజ నిండనివి తదితరాలు కలిపి దాదాపు 23 శాతం వరకు ఉంటాయని, అందువల్ల మిల్లర్లు నష్టపోయే అవకాశమే లేదని పేర్కొన్నారు. రైతులకు సహకరించాలని కోరారు.

**తరుగు హక్కు ఎవరిచ్చారు**

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద తాలు, తేమ, చెత్త అన్నీ పరిశీలించిన తర్వాతే వడ్లు తూకం వేస్తున్నారని, లారీ మిల్లుకు చేరిన తర్వాత మళ్లీ 46 కిలోల తరుగు తీస్తామని చెప్పడంలో అర్థమేంటని ప్రశ్నించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా సకాలంలో మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాల్సిన బాధ్యత అధికారులపై, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. రాబోయే 1012 రోజులు పూర్తిగా ధాన్యం కొనుగోళ్లపైనే దృష్టి పెట్టాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు.

దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని మంత్రి వెంటనే సమీక్ష నిర్వహించడం అభినందనీయమన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉంటే తేమ తగ్గిపోవడం లేదా అకాల వర్షాలతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని, మిల్లర్లు వచ్చిన లారీలను వెంటనే అన్‌లోడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ జిల్లాలో ఈసారి 2.5 నుంచి 3 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు సుమారు 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు చేరగా, అందులో 40 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తయిందని తెలిపారు. మిగిలిన ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేసేందుకు రోజుకు 10 వేల మెట్రిక్ టన్నుల చొప్పున సేకరణ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. మిల్లుల వద్ద తరుగు పేరుతో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో ప్రతి మిల్లుకు ప్రత్యేక అధికారిని నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. రానున్న 1012 రోజుల్లో రైతులు పండించిన మొత్తం వడ్లు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.





## డీజేలు, క్రాకర్స్‌పై పోలీసుల హెచ్చరిక

**కుషాయిగూడ, మే 11(ప్రజా క్షేత్రం):**

ఫంక్షన్ హాల్స్‌లో అధిక శబ్దంతో డీజేలు నిర్వహించడం, క్రాకర్స్ పేల్చడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిబంధనలు కచ్చితంగా పాటించాలని కుషాయిగూడ పోలీసులు సూచించారు. సోమవారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫంక్షన్ హాల్ యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఎస్‌హెచ్‌వో ఎల్ భాస్కర్ రెడ్డి మాట్లాడారు. విద్యార్థులు, వృద్ధులు, రోగులకు శబ్ద కాలుష్యం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. రాత్రి వేళల్లో అధిక శబ్దంతో డీజేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫంక్షన్ హాల్స్‌కు వచ్చే వాహనాలను రోడ్లపై అడ్డంగా పార్కింగ్ చేయకుండా తగిన పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్రతి ఫంక్షన్ హాల్‌లో నాణ్యమైన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, అవి నిరంతరం పని చేసేలా చూడాలని ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా యజమానులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్సైలు సుధాకర్ రెడ్డి, వెంకన్న విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ సర్వే పరిశీలించిన తహశీల్దార్ రాజశేఖర్

- ప్రభుత్వ గృహ పథకాల లబ్ధి నిజమైన అర్హులకు చేరాలి

**పెద్ద కొడప్‌గల్ మే 11(ప్రజాక్షేత్రం):**

పెద్ద కొడప్‌గల్ మండలం వడ్లం గ్రామంలో జరుగుతున్న హౌసింగ్ సర్వేను తహశీల్దార్ రాజశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి సర్వే ప్రక్రియను పరిశీలిస్తూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అర్హుల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ పథకాల లబ్ధి నిజమైన అర్హులకు చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. సర్వేలో పారదర్శకత పాటించి ప్రతి కుటుంబ పరిస్థితిని సరిగ్గా నమోదు చేయాలని సూచించారు. ఎవరైనా అర్హులు మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు సర్వే సిబ్బందికి పూర్తి సహకారం అందించి సరైన వివరాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలంటే ప్రజలు నిజమైన సమాచారాన్ని అందించాలని తెలిపారు. సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ రాజశేఖర్ తెలిపారు.



# బండి భగీరథ్ పోక్సో కేసు విచారణ ప్రారంభం

- పేట్ బషీరాబాద్ పీఎస్‌కు చేరుకున్న కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్
- ఉన్నతాధికారుల ఆదేశాలతో దర్యాప్తు వేగవంతం
- మైనర్ బాధితురాలి స్టేట్‌మెంట్ త్వరలో నమోదు
- నిందితులు ఎవరైనా కఠిన చర్యలు: సిట్ అధికారిణి

**కుత్బుల్లాపూర్, మే 11(ప్రజాక్షేత్రం):**

పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై విచారణ వేగవంతమైంది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ విచారణ అధికారిణి, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని అధికారులతో సమావేశమయ్యారు. ఎస్‌హెచ్‌ఓ క్యాబిన్‌లో ఏసీపీతో కలిసి కేసు పురోగతిపై సమీక్ష నిర్వహించిన అనంతరం డీసీపీ రితిరాజ్ మీడియాతో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ ప్రారంభించామని, కేసులో ఎవరైనా నిందితులుగా తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. త్వరలోనే మైనర్ బాధితురాలి స్టేట్‌మెంట్‌ను కూడా నమోదు చేయనున్నట్లు సిట్ అధికారిణి వెల్లడించారు. కేసుకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.








## పర్మిషన్ లేని భవనాలు సీజ్ చేసిన అధికారులు

- డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణలో ప్రత్యేక తనిఖీలు
- విశ్వ సాయి టౌన్షిప్, షాలోమ్ స్కూల్ నిర్మాణాలు సీజ్

**కుత్బుల్లాపూర్, మే 11(ప్రజాక్షేత్రం):**

దుండిగల్ సర్కిల్ పరిధిలో పర్మిషన్ లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై దుండిగల్ సర్కిల్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ పర్యవేక్షణలో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, అనుమతులు లేకుండా నిర్మాణాలు కొనసాగుతున్న పలు భవనాలను సీజ్ చేశారు. బహదూర్‌పల్లిలో టెక్ మహీంద్రా బ్యాక్‌సైడ్ వద్ద నిర్మిస్తున్న భవంతి, దుండిగల్‌లోని విశ్వ సాయి టౌన్షిప్ సమీపంలో నిర్మిస్తున్న షెడ్, బౌరంపేటలోని షాలోమ్ ఇంటర్నేషనల్ స్కూల్ వద్ద కొనసాగుతున్న భవన నిర్మాణాలను అధికారులు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌తో పాటు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు. అక్రమ నిర్మాణాలపై భవిష్యత్తులో కూడా నిరంతర చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

## నర్సంపేట ఆర్డీవో కార్యాలయంలో విషాదం

**నర్సంపేట మే 11(ప్రజాక్షేత్రం):**



డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ కి గుండెపోటు ఆఫీసులోనే కుప్పకూలి పడిపోయిన శ్రీనివాస్ హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి విధి నిర్వహణలో ఉండగానే ప్రాణాలు కోల్పోవడంతో రెవెన్యూ సిబ్బందిలో విషాదఛాయలు అదుముకున్నాయి.

## మోడీ సీఎం రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను ఖండించిన మైనార్టీ నాయకులు మొయిన్

**మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి మే 11(ప్రజాక్షేత్రం):**



తెలంగాణ ప్రజలు ఓటుతో బీజేపీ అహంకార రాజకీయాలకు ఇప్పటికే సమాధానం చెప్పారు. ప్రజలు తిరస్కరించిన రాజకీయాలను ఇప్పుడు వెనుకద్వారం ద్వారా తెలంగాణపై రుద్దాలని చూడటం బీజేపీ దివాళా రాజకీయాలకు నిదర్శనం రేవంత్ రెడ్డి ని బీజేపీలోకి ఆహ్వానిస్తామని మాట్లాడటం అంటే తెలంగాణ ప్రజల తీర్పును అవమానించడం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని జీర్ణించుకోలేకపోవడం ఎన్నికల్లో గెలవలేక ప్రజల మనసులు దక్కించుకోలేక ఇప్పుడు ఇతర పార్టీల నాయకులపై ఆశలు పెట్టుకోవడం బీజేపీ బలహీనత తెలంగాణ ప్రజలు స్పష్టంగా చెప్పారు మాకు విద్వేష రాజకీయాలు కాదు, అభివృద్ధి కావాలిఅహంకార పాలన కాదు, ప్రజాపాలన కావాలి బీజేపీ గుర్తుంచుకోవాలి తెలంగాణ అమ్ముడుపోయే నేల కాదు ప్రజల తీర్పును కొనలేరు బెదిరించలేరు... మాయ మాటలతో మార్చలేరు కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆశయాల కోసం నిలబడుతుంది తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడుతుంది అని తెలియజేశారు.

# శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి.

- అడ్మిషన్స్, క్లాసులు ఒక మండలంలో అటెండెన్స్, రిజిస్టర్స్ అన్ని మరో మండలంలో
- ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అటెండెన్స్
- రికార్డులను విద్యాధికారికి తెలియకుండా సృష్టించిన ప్రిన్సిపల్
- క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
- ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) డిమాండ్.


**శంకర్ పల్లి మే 11(ప్రజాక్షేత్రం):**

అడ్మిషన్స్ అన్ని శంకర్ పల్లి మండలంలోని శ్రీ చైతన్య పాఠశాలలో తీసుకుని తరగతులు అక్కడ నిర్వహించి ఫీజులు అక్కడే తీసుకొని అటెండెన్స్ రికార్డులు మరో మండలం చేవెళ్లలోని శ్రీ చైతన్య పాఠశాలలో సృష్టించడం జరిగింది. దీనిపైన చర్యలు కోరుతూ చేవెళ్ల ఆర్డిఓ ఆఫీస్ లో నిర్వహిస్తున్న ప్రజావాణి లో పి డి ఎస్ యు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ శంకర్ పల్లి మండలంలోని శ్రీ చైతన్య పాఠశాల (కార్పొరేట్ పాఠశాల) లో 2025 26 విద్య అకాడమిక్ కి సంబంధించి ఆ పాఠశాలలో పదవ తరగతి కి ప్రభుత్వపరంగా ఎలాంటి అనుమతులు లేకున్నా అక్కడ అడ్మిషన్స్ తీసుకొని చేవెళ్లలోని శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థులు తరగతులకు రాకపోయినా, పాఠాలు బోధించకుండా శంకర్ పల్లి నుండి ప్రతిరోజు చేవెళ్లలోని శ్రీ చైతన్య పాఠశాలకు వచ్చినట్టుగా రికార్డులు సృష్టించి అటెండెన్స్ వేసిన ప్రిన్సిపల్ కాబట్టి మీరు ఇటు ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా అధిగమించి మండల విద్యాశాఖ అధికారికి కూడా తెలియకుండా పదవ తరగతి విద్యార్థుల ఎగ్జామ్స్ సెంటర్స్ చేవెళ్లలో ఉండడంతో దానిని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్ యు) బయట పెట్టడంతో మండల విద్యాధికారికి సమాచారం తెలిసింది. అప్పటివరకు ఎలాంటి సమాచారం విద్యాశాఖ అధికారికి లేదని ఎంఈఓ అన్నారు. విద్య హక్కు చట్టం 2009 (RTE) సెక్షన్ 24 ఉల్లంఘించినందుకు మరియు భారత శిక్షా స్మృతి ప్రకారం క్రమశిక్షణ క్రిమినల్ చర్యలు తీసుకొని ఈ విధంగా తప్పుడు రికార్డులను సృష్టించిన శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ పై క్రిమినల్ కేసులు నమోదు చేసి పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని. అన్నారు.



## అక్రమంగా జంతువులను తరలిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం:ఎస్పీ రోహిత్ రాజు

**పినపాక మే 11(ప్రజాక్షేత్రం):**



రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా అక్రమంగా జంతువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయంతో అక్రమ జంతు రవాణాను అరికట్టడానికి పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపడుతుందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టును ఏర్పాటు చేసి ప్రత్యేకంగా తనిఖీలను చేపట్టడం జరుగుతుందని వివరించారు.జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పశువుల సంతలు,బక్రీద్ పండుగ దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరు తదితర విషయాలపై అధికారులకు ఖచ్చితమైన ఆదేశాలను జారీ చేయడం జరిగిందని అన్నారు.జిల్లాలో ఎక్కడైనా చట్ట విరుద్ధంగా ఆవులు,దూడలను అక్రమంగా రవాణా చేసి,వధించడం పూర్తిగా నిషేధమని,అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇతర రాష్ట్రాలు ,జిల్లాల నుండి జంతువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు 02 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ,03అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ,మొత్తం 05 చెక్‌పోస్టుల వద్ద 24/7 నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి చెక్‌పోస్టులో పోలీస్ సిబ్బందితో పాటు పశుసంవర్థక శాఖ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు కఠినంగా చేపడుతున్నట్లు వెల్లడించారు.జంతువుల రవాణా సమయంలో సంబంధిత చట్టాలు,నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని హెచ్చరించారు. అలాగే అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని,వ్యక్తిగత దాడులు,గుంపులుగా దాడులు చేయడం కూడా శిక్షార్హమైన నేరాలని ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.ప్రజలు అప్రమత్తంగా ఉండి పశువుల అక్రమ రవాణా,అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ముఖ్యంగా యువత ఆవేశానికి లోనవకుండా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని,మత పెద్దలు యువతకు శాంతి,సామరస్యాలపై అవగాహన కల్పించాలని సూచించారు.సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్,ఫేస్‌బుక్ వంటి వాటిలో పశువుల అక్రమ రవాణాకు సంబంధించి విద్వేషాలను రెచ్చగొట్టేలా మార్ఫింగ్ ఫోటోలు,అసత్య ప్రచారాలు,ప్రేరేపిత పోస్టులు పెట్టినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకోసం జిల్లా పోలీస్ మీడియా మానిటరింగ్ సెల్ నిరంతర నిఘా ఉంచిందని తెలిపారు. ప్రజల్లో భయాందోళనలు కలిగించే రూమర్లు వ్యాప్తి చేసిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని,డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ప్రతీ పండుగ సందర్భంగా ప్రజలు పరస్పరం మతాలను గౌరవించుకుంటూ, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.జిల్లాలో శాంతి భద్రతలను కాపాడటానికి ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## సమ్మర్ క్యాంప్ లో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి మే 11(ప్రజాక్షేత్రం):**


మూసాపేట్ మండలం సంకల్ మద్ది గ్రామ సమీపంలోని కేజీబీవీ పాఠశాల లో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ లో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని, పాఠశాలలో మౌలిక వసతులను పట్టించుకోలేదని, పదేళ్ల పాలనలో టీచర్ల నియామకాలను చేపట్టలేదని, విద్యాశాఖకు నిధులు కేటాయించలేదని బిఆర్ఎస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా విద్యాశాఖకు అధిక నిధులు కేటాయించడంతో పాటు 11,062 టీచర్ పోస్టులు భర్తీ చేశామని, 15 ఏళ్ల తర్వాత సుమారు 19,000 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించామని, అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించామని, స్కూలు ప్రారంభమైన మొదటి వారంలోనే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు పంపిణీ చేశామని, పదేళ్లలో ఎన్నడు లేని విధంగా విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచామని గుర్తు చేశారు. దేవరకద్ర నియోజకవర్గం లో గత పాలకులు పదేళ్లు అధికారంలో ఉండి, కనీసం డిగ్రీ కాలేజ్ ను ఏర్పాటు చేయలేకపోయారని, కానీ తాము అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కాలేజ్ మంజూరు ఏర్పాటు చేశామని, చిన్న చింతకుంట మండల కేంద్రంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేశామని తెలియజేశారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా ఏకాగ్రతతో చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు, అదేవిధంగా సమ్మర్ క్యాంప్ లో అధ్యాపకులు ఇస్తున్న శిక్షణను అందిపుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే క్వాలిఫైడ్ టీచర్స్ ఉంటారని, విద్యార్థులకు మంచి విద్యాబోధన అందుతుందని తెలిపారు, చదువుకుంటే ప్రపంచాన్ని జయించవచ్చని అన్నారు, తాను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుని ఈ స్థాయికి వచ్చామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## సొంపల్లిలో ఘనంగా అరవ దుర్గారావు – నాగ సౌజన్య రిసెప్షన్ వేడుక

**బూర్గంపాడు మే 11(ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సొంపల్లి గ్రామ పంచాయతీలో ఆరవ వెంకటేశ్వర్లు - విజయ దంపతుల కుమారుడు దుర్గారావు మరియు నాగ సౌజన్యల రిసెప్షన్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు బూర్గంపాడు మండల మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ముఖ్య అతిథిగా హాజరై నవ దంపతులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మొరంపల్లి బంజర మాజీ వార్డు సభ్యురాలు కామిరెడ్డి పద్మ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోనెల నాని, కోటా రమేష్, మంద ప్రసాద్, సుధాకర్, ప్రజాక్షేత్రం రిపోర్టర్ నస్కూరి సందీప్, సోంపల్లి గ్రామ యూత్ అధ్యక్షుడు అరవింద స్వామి, ధనుగురి బాలాజీ తో పాటు గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. వేడుక సందర్భంగా కుటుంబ సభ్యులు అతిథులను ఆత్మీయంగా ఆహ్వానించి ప్రత్యేక విందును ఏర్పాటు చేశారు. గ్రామంలో ఆనందోత్సాహాల మధ్య జరిగిన ఈ రిసెప్షన్ వేడుక ఆకట్టుకుంది.



# చిట్టెపు ప్రకాష్ రెడ్డి జ్ఞాపకార్థం రోగులకు అల్పాహార పంపిణీ

- చిట్టెపు ప్రకాష్ రెడ్డి 5వ వర్ధంతి ఘనంగా నిర్వహణ
- సేవా కార్యక్రమాల్లో చిట్టెపు ప్రకాష్ రెడ్డి ఎల్లప్పుడు ముందుండే వారు
- జిల్లా ఆసుపత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో రోగులకు, సహాయకులకు అల్పాహారం పంపిణీ

**పెద్దేముల్, మే 11(ప్రజాక్షేత్రం):**

పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు,గ్రామ పెద్దలు,కీర్తి శేషులు చిట్టెపు ప్రకాష్ రెడ్డి 5వ వర్ధంతిని ఆయన చిన్న కుమారుడు చిట్టెపు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిన్న కుమారుడు చిట్టెపు శ్రీకాంత్ రెడ్డి తన తండ్రి చిట్టెపు ప్రకాష్ రెడ్డి జ్ఞాపకార్థం 5వ వర్ధంతి సందర్భంగా తాండూరు జిల్లా ఆసుపత్రి అలాగే మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో రోగులకు,వారి సహాయకులకు ఉదయం సమయంలో అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువ నాయకుడు చిట్టెపు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి సేవా భావం,నిరుపేద ప్రజల పట్ల ఉన్న అనురాగాన్ని స్మరించుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సమాజ సేవ తన తండ్రికి ఎంతో ఇష్టమని,ఆయన ఆశయాలను కొనసాగించే దిశగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.అల్పాహార పంపిణీ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు. తన తండ్రి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించడంతో పలువురు అభినందించారు.



# మోడీ సభ విజయవంతం చేసిన కార్యకర్తలు ప్రజలకు ధన్యవాదాలు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడెల్లి రవీందర్ ఎడ్ల రమేష్

**సంగారెడ్డి మే 11(ప్రజాక్షేత్రం):**

ప్రధాని మోడీ సభ అనుకున్న స్థాయికన్నా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేసిన కార్యకర్తలకు నాయకులకు ప్రజలకు ధన్యవాదలు అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడెల్లి రవీందర్ పేర్కొన్నారు. హైదరాబాద్ లో జరిగిన బహిరంగ సభకు బీరంగూడ అమీనపూర్ డివిజన్ల నుండి పెద్ద ఎత్తున్న బస్సులో కార్లలో తరలివాళ్లారు. ఈసందర్భంగా రవీందర్ ఎడ్ల రమేష్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ పర్యటన కార్యకర్తల్లో ప్రజల్లో ఉత్సహన్ని నింపిందని ప్రజలు లక్షలాదిగా విచ్చేసి సభ విజయవంతం చేశారాణి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారం తెచ్చేందుకు బీజేపీ ప్రజలు బీజేపీ కీ అండగా ఉండవల్సిన అవసరం ఉందని తెలిపారు. నరేంద్ర మోడీ తెలంగాణ అభివృద్ధి కీ విశేషమైన కృషి చేస్తున్న విషయం ప్రజలు గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయమని తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడెల్లి రవీందర్ రాష్ట్ర నాయకులు ఎడ్ల రమేష్ బీరంగూడ డివిజన్ అధ్యక్షులు ఆగరెడ్డి అమీనపూర్ డివిజన్ అధ్యక్షులు కొత్తపల్లి రమేష్ ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి శ్రవణ్ లక్షణ్ గుప్తా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి తులసి రమాదేవి సునీత ప్రభాకర్ పాండురంగరావు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వందల కోట్ల అప్పుల పాలైన దేశం దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుంది

- సోషల్ మీడియా అధ్యక్షుడు కూచుమల్ల సుధాకర్

**వలిగొండ మే 11(ప్రజాక్షేత్రం):**



వలిగొండ పట్టణ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షుడు కూచిమల్ల సుధాకర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగారం కొనొద్దు, పెట్రోల్‌డీజిల్ కోసం ప్రజలు తిరగొద్దని చెప్పడం స్వతంత్ర భారత చరిత్రలో ఏ ప్రధానమంత్రి కూడా చేయలేదన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడిపై నమోదైన పోక్సో కేసులో వెంటనే అరెస్టు చేసి రిమాండ్కు తరలించాలని డిమాండ్ చేశారు. మోదీ పాలనలో ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరిగాయని, మొక్కజొన్న, కాటన్ వంటి పంటలను కూడా దిగుమతి చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. డాలర్ విలువ పెరగడంతో రూపాయి బలహీనపడిపోయి దేశ ఆర్థిక వ్యవస్థ క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్లిందని విమర్శించారు. గత 12 ఏళ్లలో లక్షల కోట్ల అప్పులు చేసిన కేంద్ర ప్రభుత్వం ఆ నిధులను ఏ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు నరేంద్ర మోదీ, రేవంత్ రెడ్డి మధ్య ఉన్న దోస్తీపై ప్రజలకు సమాధానం చెప్పాలని, కాంగ్రెస్‌బీజేపీ రెండు పార్టీలు ఒకటేనని ఆరోపించారు. తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు.

# శిలాఫలకానికే పరిమితమైన సీసీ రోడ్డు

- డ్రైనేజీ ఎత్తుతో ప్రమాదకరంగా మారిన 9వ వార్డు మట్టి మార్గం

**వనపర్తి, మే 11(ప్రజాక్షేత్రం):**





జిల్లా కేంద్రంలోని కర్నూల్ రోడ్డుకు ఆనుకుని 9వ వార్డులోని పల్లవి రెడ్డి హోటల్ పక్కన ఉన్న ప్రధాన మట్టి రహదారిని తక్షణమే సీసీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని కాలనీ ప్రజలు కోరారు. ఈ మేరకు వార్డు కౌన్సిలర్ మహేశ్వరి ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. రహదారి దుస్థితితో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు.

**ఏళ్ల క్రితమే శిలాఫలకం... కానీ పనులు శూన్యం**

స్థానికుల కథనం ప్రకారం గత కౌన్సిల్ హయాంలోనే ఈ రహదారి నిర్మాణానికి శిలాఫలకం ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రహదారి ఇప్పటికీ మట్టి మార్గంగానే మిగిలిపోయిందన్నారు. వర్షాకాలంలో బురదతో నిండిపోతుండగా, ఎండాకాలంలో దుమ్ము దూసుకెళ్లి ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల బీటీ రహదారి పక్కన నిర్మించిన డ్రైనేజీ ఎత్తు ఎక్కువగా ఉండటంతో కాలనీలోకి వెళ్లే మట్టి రహదారి ప్రమాదకర ఏటవాలుగా మారిందని స్థానికులు తెలిపారు. ఈ కారణంగా ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి జారిపడుతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే పలువురు గాయపడిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులు, వృద్ధులు ఈ మార్గంలో నడవడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొన్నదన్నారు. ప్రజల సమస్యను అత్యవసరంగా పరిగణించి వెంటనే సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కాలనీ వాసులు మున్సిపల్ చైర్మన్‌ను కోరారు. దీనిపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్ సమస్యను పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కౌన్సిలర్ మహేశ్వరి తెలిపారు.

# బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి కొమరం సావిత్రి

- ఫోక్సో కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రతిఘటన తప్పదు

**బూర్గంపాడు మండలం మే 11(ప్రజాక్షేత్రం):**

మైనర్ బాలికను బెదిరించడంతో పాటు పాటు లైంగిక వేధింపులకు పాల్పడిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ పై ఫోక్సో కేసు నమోదు అయినప్పటికీ అరెస్టు చేయకపోవడం ఏమిటని కొమరం సావిత్రి సారపాక మేజర్ గ్రామపంచాయతీ 14వ వార్డు నెంబర్ ప్రశ్నించారు. సోమవారం నాడు కొమరం సావిత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు మైనర్ బాలిక తల్లిదండ్రులు మూడు నెలల క్రితం ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పు పట్టారు. మైనర్ బాలికను తీవ్రంగా వేధించడంతో పాటు బాలిక విదేశాలకు వెళ్లకుండా అడ్డుకున్న భగీరథను నేటికీ అరెస్టు చేయకపోవడం దారుణం అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తో పోలీసులు ఒకరికొకరు కుమ్మక్కై కేసుల నుంచి తప్పించుకునేందుకు స్పెషల్ బెయిల్ వచ్చేలా ఫోక్సో కేసులో సెక్షన్లు మార్చి పెట్టడాన్ని తీవ్రంగా విమర్శించారు. మైనర్ బాలిక కుటుంబంపై దౌర్జన్యం చేస్తున్న పట్టించుకోకుండా భగీరథకు అనుకూలంగా చట్టం పని చేస్తుందన్నారు.



తప్పు చేస్తే నేను కాపాడుతా నేను తప్పు చేస్తే నువ్వు కాపాడు అన్న రీతిలో పాలన సాగిస్తున్నారని అనుమానం. బేటి పడావో బేటి బచావో అంటున్న ప్రధాని నరేంద్ర మోడీ భేటీ ఎక్కడ కాపాడబడుతుందో చెప్పాలన్నారు. బండి సంజయ్ కుమారుడి పై గతంలో చాలా కేసులు ఉన్నాయని వెంటనే బండి సాయి భగీరథను అరెస్టు చేసి కఠిన చర్యలు చేపట్టాలని బాధిత మైనర్ బాలిక కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళ లోకం ఉద్యమిస్తుందని హెచ్చరించారు. బాలిక కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురి చేస్తున్న బండి సంజయ్ పై కేసు నమోదు చేయడంతో పాటు ఫోక్సో కేసు నమోదైన బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని, బాధిత బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసిన నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే మేఘారెడ్డి భరోసా

- ఇద్దరికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం

**వనపర్తి, మే 11(ప్రజాక్షేత్రం):**

అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న ఇద్దరు బాధితులకు ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆర్థిక సహాయం అందించారు. జిల్లా కేంద్రంలోని ఆరవ వార్డుకు చెందిన బొలెమోని అంజి ముదిరాజ్ పక్షవాతంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. మెట్టుపల్లికి చెందిన రంగం శివ బోన్ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా, ఆయనను కూడా ఎమ్మెల్యే పరామర్శించి రూ.10 వేల సాయం అందించారు. అవసరమైతే బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో ప్రభుత్వ ఎల్‌ఓసీ ద్వారా చికిత్స అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అందించిన సహాయానికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహేష్, గోకం బాలరాజు, కనకం మహేష్, నిఖిల్ చంద్ర, గోకం రాఘువేంద్ర, డ్రైవర్ అంజి, గోకం రాముడు, బొలెమోని వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# దాసిరెడ్డి గూడెం గ్రామంలో కూనపురి రాములు ఘనంగా 12వ వర్ధంతి

**వలిగొండ మే 11(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం దాసిరెడ్డి గూడెం గ్రామంలో వలిగొండ మార్కెట్ మాజీ చైర్మన్ కూనపురి కవిత ఆధ్వర్యంలో స్వర్గీయ కూనపురి రాములు స్తూపం వద్ద నివాళులు అర్పించి 12వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ సురకంటి వెంకట్ రెడ్డి సర్పంచ్ రాపోలు గోపి ఏం తుర్కపల్లి మాజీ ఎంపీటీసీ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి మాజీ అధ్యక్షులు దేగల పాండు మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి కూనపురి స్వర్ణలత పట్టణ అధ్యక్షులు ఎండి అప్రోచ్ వార్డ్ నెంబర్ బలుగూరి నరేష్ రెడ్డి మండల సోషల్ మీడియా అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్ పోలేపాక సత్యనారాయణ ఎండి అజ్జు పల్లె శ్రీశైలం అభిమానులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రానికే ఆదర్శంగా కరీంనగర్ మార్కెట్

- రైతులకు మెరుగైన సేవలే లక్ష్యం
- మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబును కలిసిన మార్కెట్ కమిటీ ప్రతినిధులు

**కరీంనగర్, మే 11(ప్రజాక్షేత్రం):**

కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్దాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. రైతుల సంక్షేమం, మార్కెట్ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందని హామీ ఇచ్చారు. సోమవారం హైదరాబాద్ సచివాలయంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు నేతృత్వంలో కరీంనగర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఆకుల నరసయ్య మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రులకు శాలువాలు కప్పి సన్మానించారు. తన నియామకానికి సహకరించినందుకు ఆకుల నరసయ్య కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ మార్కెట్ కమిటీ రైతులకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మార్కెట్ కమిటీల పాత్ర కీలకమని పేర్కొన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు మార్కెట్ యార్డుల్లో ఆధునిక సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. వెలిచాల రాజేందర్‌రావు సహకారంతో కరీంనగర్ మార్కెట్‌ను ఇతర మార్కెట్లకు ఆదర్శంగా తీర్చిదిద్దాలని అన్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని, అవసరమైన నిధులు, పరిపాలనా సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలే తమ ప్రధాన లక్ష్యమన్నారు. మార్కెట్‌ను ఆధునీకీకరించి రైతులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రైతులకు అండగా నిలుస్తూ పారదర్శకంగా సేవలు అందిస్తామని చెప్పారు. ఆకుల నరసయ్య మాట్లాడుతూ తనపై ప్రభుత్వం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పారదర్శకంగా మార్కెట్ వ్యవహారాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కరీంనగర్ మార్కెట్‌లో మౌలిక వసతుల విస్తరణ, ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం, రైతులకు విశ్రాంతి గదులు, తాగునీటి సదుపాయం, పారదర్శక తూకం వ్యవస్థ, డిజిటల్ సేవల అమలుపై మంత్రులతో చర్చించారు. ఈ అంశాలపై మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వేల్పుల వెంకటేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.





## విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి పీఎం శ్రీ సమ్మర్ క్యాంప్ ప్రారంభం

- **గ్రామీణ విద్యార్థులకు ఆధునిక విద్యా అవకాశాలు**
- **వేసవిని సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక శిక్షణ**

**పెద్ద కొడప్‌గల్ మే 11(ప్రజాక్షేత్రం):**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పీఎం శ్రీ' వేసవి శిబిరాన్ని తహశీల్దార్ రాజశేఖర్ సోమవారం ప్రారంభించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసం లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా ఆధునిక విద్యలో ముందంజలో ఉండాలని, అందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం, యోగా, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి అంశాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను మెరుగుపర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో పోటీ ప్రపంచాన్ని ఎదుర్కోవడానికి కమ్యూనికేషన్ స్కిల్స్, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. ఎంఈవో ప్రవీణ్ మాట్లాడుతూ ఈ వేసవి శిబిరానికి మొత్తం 100 అడ్మిషన్ల లక్ష్యాన్ని నిర్దేశించామని, ప్రారంభమైన తొలి రోజే 20 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరింత మంది విద్యార్థులు పాల్గొనే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పాఠశాల హెచ్ఎం కమల మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని శిబిరాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు విద్యా నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పీఎంజే దోపిడీ కేసులో కీలక పురోగతి




- **ఐదు రాష్ట్రాల్లో పోలీసుల వేట**
- **సెల్‌ఫోన్ క్లూతో దొంగల ముఠాలో ముగ్గురు అరెస్ట్**

**కరీంనగర్, మే 11(ప్రజాక్షేత్రం):**

సంచలనం రేపిన పీఎంజే జ్యూవెలరీ దోపిడీ కేసు దర్యాప్తులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు పశ్చిమ బెంగాల్, బిహార్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా.. ఇద్దరు ప్రధాన నిందితులతో పాటు దోపిడీ సొత్తును కొనుగోలు చేసిన ఓ వ్యాపారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితులను కరీంనగర్‌కు తరలిస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

**సెల్‌ఫోన్ క్లూతో దొంగల జాడ**

జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం మద్దునూర్ సమీపంలో లభించిన ఓ సెల్‌ఫోన్ ఈ కేసులో కీలక ఆధారంగా మారింది. ఆ ఫోన్‌లో లభించిన డేటా, కాల్ వివరాలు, లొకేషన్ ఆధారంగా పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. నిందితులు రాష్ట్రాల మార్పిడి చేస్తూ తప్పించుకునేందుకు ప్రయత్నించినప్పటికీ.. సాంకేతిక ఆధారాలతో పోలీసులు వారి కదలికలను గుర్తించారు. ప్రత్యేక బృందాలు రాత్రింబవళ్లు గాలింపు కొనసాగించి చివరకు ముఠాను ట్రాక్ చేసినట్లు తెలుస్తోంది.

**సాంకేతిక అస్త్రాలతో పోలీసుల ఆపరేషన్**



ఈ కేసు ఛేదనలో పోలీసులు అత్యాధునిక సాంకేతికతను వినియోగించినట్లు సమాచారం. దోపిడీ జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరా దృశ్యాలను నిశితంగా పరిశీలించి.. నిందితుల చిత్రాలను స్పష్టంగా రూపొందించారు. అనంతరం వాటిని పాత నేరస్థుల డేటాబేస్‌తో పోల్చి ముఠాను గుర్తించినట్లు తెలిసింది. సెల్‌ఫోన్ సిగ్నల్స్, ఆధార్ లింకులు, ప్రయాణ వివరాలను విశ్లేషిస్తూ పోలీసులు మహారాష్ట్ర, బిహార్ ప్రాంతాల్లో నిందితుల కదలికలను ట్రాక్ చేశారు. త్వరలోనే కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉన్నట్లు సమాచారం.







# ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం

- **రైతులను దోచుకుంటున్న మిల్లర్లు, అధికారులపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం**

**వనపర్తి, మే 11(ప్రజాక్షేత్రం):**

వరి, మొక్కజొన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సోమవారం వనపర్తి మార్కెట్ యార్డులో మెరుపు ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి తాళ్ల చెరువు, చిన గుంటపల్లి, గోపాల్‌పేట కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఆయన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ప్రతిగింజ కొనుగోలు చేస్తామని చెప్పిన మంత్రులు, అధికారుల హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. రైతుబంధు, సాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా లేకపోయినా రైతులు అష్టకష్టాలు పడి పంటలు పండించారని, ఇప్పుడు కొనుగోళ్లు జరపక రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రవాణా సౌకర్యాలు, హమాలీలు, గన్నీ బ్యాగుల కొరతను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. యాసంగి పంటలో తరుగు ఉండదని తెలిసినా క్వింటాకు 10 కిలోల వరకు తరుగు పేరుతో మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం యాసంగిలో 65.45 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, సుమారు 1.50 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 15-16 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేశారని తెలిపారు. మరోవైపు 16.46 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగిందని, ఎక్కడ చూసినా మొక్కజొన్న రాశులు కనిపిస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క క్వింటా కూడా కొనుగోలు కాలేదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు సకాలంలో ఎరువులు, విద్యుత్, సాగునీరు అందించడంతో పాటు మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు జరిగేదని గుర్తుచేశారు. ప్రస్తుతం కనీసం యూరియా కూడా అందించలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే వరి, మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభించాలని, లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, నందిమల్ల అశోక్, కె.మాణిక్యం, భానుప్రకాశ్, రఘువర్ధన్‌రెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, గంధం పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



## డిగ్రీ కళాశాల విద్య వారోత్సవాల్లో పాల్గొన్న అమనగల్ మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి

- **ఆమనగల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి**

**ఆమనగల్ మే 11(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రభుత్వ ప్రణాలిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కళాశాల విద్యాశాఖ మే11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు విద్యావారోత్సవాలు నిర్వహిస్తుంది. కళాశాల విద్యాశాఖ అదేశాలననుసరించి ఈరోజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆమనగల్లో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శార్వాని అధ్యక్షతన ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పట్టణ మున్సిపల్ కమీషనర్ రాఘవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమీషనర్ కార్యక్రమనుద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉన్నత విద్య కోసం చేస్తున్న కృషిని వివరించి,ప్రభుత్వ డిగ్రీ కళాశాల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాగలరు, ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన లెక్చరర్స్ నాణ్యమైన విద్యను అందిస్తారు కావున ఆమనగల్ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పొంది సద్వినియోగం చేసుకోవలసిందిగా విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

- **ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురి మృతి**
- **మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డుపై ఘటన**
- **కారు, స్పోర్ట్స్ బైక్ ఢీకొనడంతో ప్రమాదం**
- **మృతుల్లో ఇద్దరు చిన్నారులు, ఇద్దరు బైకర్లు**
- **యూ-టర్న్ తీసుకుంటుండగా కారును ఢీకొట్టిన బైక్మ**

**హబూబ్‌నగర్ మే 11(ప్రజాక్షేత్రం):**

జిల్లాలో గత రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డులోని పాలకొండ జంక్షన్ వద్ద ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, ఆదివారం రాత్రి పాలకొండ కూడలి వద్ద యూటర్న్ తీసుకుంటున్న ఒక కారును అతివేగంగా వస్తున్న స్పోర్ట్స్ బైక్ బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు బైక్‌పై ఉన్న ఇద్దరు, కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారులోని మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. బైక్ అతివేగమే ప్రమాదానికి ప్రాథమిక కారణమని భావిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్లు, ఘటనా స్థలంలో లభించిన ఆధారాల సహాయంతో మృతుల పూర్తి వివరాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.



## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

- **ఆరుగురు సభ్యులను కూడా నియమించిన ప్రభుత్వం**
- **సభ్యుల్లో కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత తదితరులు**
- **ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం**

**హైదరాబాద్ మే 11(ప్రజాక్షేత్రం):**



తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమితులయ్యారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్, ఆరుగులు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ యాదవ రెడ్డి, సదాలక్ష్మి, రాధాబాయి, ఉజ్మా షకీరాలను నియమించారు. వీరి పదవీకాలం ఐదేళ్ల పాటు ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ రాష్ట్రంలోని మహిళల హక్కులను పరిరక్షించడానికి, వారిపై జరుగుతున్న అన్యాయాలు, వేధింపులను అరికట్టడానికి ఏర్పాటు చేయబడిన చట్టబద్ధమైన సంస్థ. ఇది మహిళలకు న్యాయం చేకూర్చడం, సంక్షేమం మరియు సాధికారత కోసం పనిచేస్తుంది.

## ప్రకృతి అందాలతో కనువిందు చేస్తున్న లక్ష్మారెడ్డి గూడ రహదారి

- **పచ్చని చెట్లతో ఆహ్లాదంగా మారిన శంకర్ పల్లి-వికారాబాద్ ప్రధాన రహదారి**
- **వాహనదారులు, బాటసారులకు చల్లని నీడ**
- **స్వచ్ఛమైన ఆక్సిజన్ అందిస్తున్న హరితహారం పచ్చని చెట్లు**
- **లక్ష్మారెడ్డి గూడ గ్రామానికి స్వాగత తోరణంలా పచ్చని చెట్లు**

**శంకర్ పల్లి, మే 11(ప్రజాక్షేత్రం):**

ప్రధాన రహదారులకు ఇరువైపులా నాటిన పచ్చని చెట్లు ప్రస్తుతం వాహనదారులు, ప్రయాణికులు, బాటసారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ముఖ్యంగా శంకర్ పల్లి మండల పరిధిలోని లక్ష్మారెడ్డి గూడ గ్రామ శివారులో శంకర్ పల్లివికారాబాద్ ప్రధాన రహదారి వెంట పెరిగిన పచ్చని చెట్లు ఎండాకాలంలో చల్లని నీడనందిస్తూ ప్రయాణికులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఈ రహదారిపై ప్రయాణించే వారు చెట్ల కింద కొద్దిసేపు విశ్రాంతి తీసుకుంటూ త్రాగు నీరు సేవించి సేదతీరుతున్నారు. మండుతున్న ఎండల్లో ప్రయాణించి చెట్ల నీడలోకి చేరుకున్న వాహనదారులకు ఈ పచ్చని చెట్లు ప్రకృతి మాత చల్లని ఒడిలా అనిపిస్తున్నాయి. నీడతో పాటు స్వచ్ఛమైన ప్రాణవాయువు (ఆక్సిజన్)ను అందిస్తూ ఆ ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. మరోవైపు లక్ష్మారెడ్డి గూడ గ్రామానికి స్వాగత తోరణంలా కనిపిస్తున్న ఈ చెట్ల మధ్య యువత బైకులపై సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. పచ్చని చెట్ల అందాలు చూసి పలువురు ప్రయాణికులు మురిసిపోతున్నారు. "పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు" అనే నినాదం ఈ ప్రాంతంలో ప్రత్యక్షంగా కనిపిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాటిన ఈ మొక్కలు ఇప్పుడు భారీ చెట్లుగా మారి ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని,ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. మొత్తంగా శంకర్ పల్లివికారాబాద్ ప్రధాన రహదారి వెంట ఉన్న ఈ పచ్చని చెట్లు ప్రయాణికులకు చల్లని నీడతో పాటు స్వచ్ఛమైన గాలిని అందిస్తూ ప్రకృతి సోయగాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి.



## ఆ పాత్ర నాకు సవాలుగా మారింది..

గత ఇరవై ఏళ్లుగా సినీ పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి వేదిక. 'మదరాసి' అనే తమిళ సినిమాతో వెండితెరకు పరిచయమైన ఈ అందాల భామ, ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోలేదు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలతో పాటు హిందీలోనూ నటించి ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను మెప్పిస్తోంది. ఇటీవల 'ఆడు-3' అనే మలయాళ చిత్రంతో పలకరించిన వేదిక, తాజాగా తన రాబోయే సినిమాల గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. వేదిక ప్రస్తుతం రెండు భారీ తమిళ ప్రాజెక్టులలో నటిస్తోంది. "ప్రస్తుతం నేను రెండు సినిమాల షూటింగ్‌లో బిజీగా ఉన్నాను. అందులో ఒకటి భయపెట్టే హారర్ సినిమా కాగా, మరొకటి అద్భుతమైన ఫాంటసీ కథాంశంతో సాగుతుంది. ఈ రెండు చిత్రాల షూటింగ్ దాదాపు పూర్తికావొచ్చింది" అని వెల్లడించింది.

అయితే ఆ సినిమాల పేర్లను మాత్రం ఆమె బయటపెట్టలేదు. ముఖ్యంగా, ఈ సినిమాల్లో తను చేస్తున్న ఒక పాత్ర తనను చాలా కష్టపెట్టిందని వేదిక చెప్పుకొచ్చింది. "ఆ పాత్ర కోసం నేను మునుపెన్నడూ లేనంతగా శ్రమించాను. నా పరిమితులను దాటి ఆ పాత్రలో ఒదిగిపోవడానికి ప్రయత్నించాను. ఇది నా కెరీర్‌లోనే ఒక మొట్టమొదటి విభిన్నమైన అనుభవం. సినిమా థియేటర్లలోకి వచ్చినప్పుడు ఆ పాత్ర కోసం నేను పడ్డ కష్టం ప్రేక్షకులకు స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆమె ఎంతో నమ్మకంగా తెలిపింది. సాధారణంగా సినిమాల్లో అందంగా కనిపించే వేదిక, ఇప్పుడు ఇలా తన నటనకు సవాలు విసిరే పాత్రలను ఎంచుకోవడం చూస్తుంటే, హిట్ కోసం చాలా పకడ్బందీ వేసినట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. దీంతో ఆ రెండు సినిమాలు ఏమిటి? ఆమె అంతగా కష్టపడిన ఆ విభిన్నమైన పాత్ర ఎలా ఉండబోతోంది? అని ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



బుల్లితెర నటి, సోషల్ మీడియా సెన్సేషన్ అషు రెడ్డి ప్రస్తుతం తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఒకవైపు వ్యక్తిగత వివాదాలు, కోర్టు కేసులతో సతమతమవుతున్న ఆమెకు, తన ప్రాణ స్నేహితుడు, నటుడు భరత్ కాంత్ రోడ్డు ప్రమాదంలో మరణించడం కోలుకోలేని దెబ్బ. ఈ విషాద వార్తను తెలుపుతూ అషు రెడ్డి సోషల్ మీడియాలో పెట్టిన ఎమోషనల్ పోస్ట్ ప్రస్తుతం అందరినీ కన్నీరు పెట్టిస్తోంది. నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా మే 11న తెల్లవారుజామున ఈ ఘోర ప్రమాదంలో భరత్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగుళూరు-తుక్కుగూడ మార్గంలో, ఎగ్జిట్-12 సమీపంలో భరత్ ప్రయాణిస్తున్న కారు నియంత్రణ కోల్పోయి ముందు వెళ్తున్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భరత్ కాంత్‌తో పాటు సాయిత్రిలోక్ అనే వ్యక్తి అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. భరత్‌తో కలిసి దిగిన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ అషు రెడ్డి ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. "నువ్వు లేని లోటు ఎప్పటికీ తీరదు. నా ప్రాణ స్నేహితుడు, నా ఫ్యామిలీ మెంబర్, నా ఆత్మీయుడు.. నా ఎమర్జెన్సీ కాంటాక్ట్ అయిన నువ్వు ఇప్పుడు శివయ్య చెంతకు చేరిపోయావు.

నీకు ఎప్పటికీ చేరని ఈ సందేశాన్ని ఇలా పోస్ట్ చేయాల్సి వస్తుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. నిన్ను మళ్ళీ కలిసే వరకు నీ చిరునవ్వు నా జ్ఞాపకాల్లో అలాగే ఉంటుంది. మిస్ యూ భరత్" అంటూ తన ఆవేదనను వ్యక్తం చేశారు. షార్ట్ ఫిలిమ్స్ ద్వారా నటుడిగా కెరీర్ ప్రారంభించిన భరత్ కాంత్, 2024లో విడుదలైన 'టెనెంట్' సినిమాతో వెండితెరకు పరిచయమయ్యారు. కేవలం నటుడిగానే కాకుండా సినిమాటోగ్రాఫర్‌గా కూడా పని చేస్తూ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువ నటుడు ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడం టాలీవుడ్‌లో విషాదాన్ని నింపింది. మరోవైపు అషు రెడ్డి ఇప్పటికే 9.35 కోట్ల రూపాయల మోసం కేసులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లండన్‌కు చెందిన ధర్మేంద్ర అనే వ్యక్తి పెళ్లి పేరుతో తనను మోసం చేసిందని పెట్టిన కేసుపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రాణ స్నేహితుడిని కోల్పోవడం ఆమెను మరింత కృంగదీసింది.

## నువ్వు లేని లోటు ఎప్పటికీ తీరదు..





## బోల్డ్ పాత్రలో డింపుల్.. 'భోగి' లుక్ రిలీజ్

భిన్న కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను అలరించేందుకు దర్శకుడు సంపత్ నంది సిద్ధమవుతున్నారు. ఆయన దర్శకత్వంలో శర్వానంద్ హీరోగా రానున్న చిత్రం 'భోగి'. ఆగస్టు 28న విడుదల కానుంది. ఇప్పటికే హీరో, హరోయిన్ లుక్స్‌తో అంచనాలు కలిగించిన ఆయన తాజాగా ఇందులో కీలకపాత్రలో నటిస్తోన్న డింపుల్ హయాతి లుక్‌ను పంచుకున్నారు. ఇందులో ఆమె మందారం అనే పాత్రలో కనిపించనున్నట్లు దర్శకుడు చెప్పారు. ఎవరినీ లెక్కచేయని ఓ బోల్డ్ పాత్రలో ఆమె నటిస్తున్నట్లు తెలిపారు. 'ప్రపంచానికి ఆమె సౌందర్యం కావాలి. కానీ, ఆమె మనసును ఎవరూ అర్థం చేసుకోరు' అనే క్యాప్షన్‌తో డింపుల్ లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు.

ఇటీవలే అనుపమ పరమేశ్వరన్ పాత్రను కూడా టీమ్ పరిచయం చేసింది. ఇందులో (Bhogi) ఆమె 'కందుల సులోచన రాణి'గా కనిపించనున్నారు. 'ప్రకృతి బిడ్డ.. గంగమ్మ నిలయం.. కందుల వారి గర్వం.. భోగి చిత్రానికి ఆమె ప్రాణం' అని ఆ పాత్రను పరిచయం చేశారు. ఉత్తర తెలంగాణ - మహారాష్ట్ర ప్రాంతాలతో ముడిపడిన ఈ పీరియాడిక్ కథని పాన్ ఇండియా స్థాయిలో తెర పైకి తీసుకొస్తున్నారు.

## ప్రేమ ఎప్పుడూ గొప్పదే.. విజయ్ సీఎం అయ్యాక త్రిష తొలి పోస్ట్

తమిళనాడులో నెలకొన్న ఉత్కంఠకు తెర దించుతూ.. ముఖ్యమంత్రిగా టీవీకే అధినేత విజయ్ ఆదివారం ఉదయం ప్రమాణం చేసిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమంలో నటి త్రిష సందడి చేశారు. సంప్రదాయ చీరకట్టులో నీలం రంగు పట్టుచీరలో హుందాగా కనిపించిన త్రిష (Trisha) అందరి దృష్టిని ఆకర్షించారు. విజయ్ ప్రమాణస్వీకారం అనంతరం ఆమె తాజాగా ప్రేమ గురించి పోస్ట్ పెట్టారు.


''ప్రేమ ఎప్పుడూ గొప్పగానే వ్యక్తమవుతుంటుంది'' అంటూ నీలిరంగు హార్ట్ ఏమోజీని జోడించారు (Trisha Post about Love). తనకెంతో ఇష్టమైన తన టీమ్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఆమె పంచుకున్న ఫొటోలు వైరల్ అవుతున్నాయి. విజయ్‌తో (Vijay) త్రిష ఐదు సినిమాల్లో నటించారు. అవి హిట్‌గా నిలవడమే కాకుండా ఇద్దరి కెరీర్‌ను మలుపుతిప్పాయి. తొలి సినిమా సమయంలోనే ఇద్దరూ మంచి స్నేహితులు అయ్యారు. ఆదివారం జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలోనూ విజయ్ ప్రమాణం చేస్తుండగా ఆమె కొంచెం భావోద్వేగానికి గురయ్యారు.



## మేమూ సమానంగా కష్టపడుతున్నాం.. హీరోలపై కృతి సనన్ ఫైర్!

సినీ పరిశ్రమలో హీరోలు, హీరోయిన్లు సమానంగా కష్టపడుతున్నప్పటికీ పారితోషికం, గౌరవం విషయంలో ఇంకా భారీ తేడా కొనసాగుతోందని బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన కృతి, టాలీవుడ్‌లో మహేశ్ బాబు సరసన '1 నేనొక్కడినే' సినిమాతో ఎంట్రీ ఇచ్చి, తర్వాత బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ప్రస్తుతం నటిగా మాత్రమే కాకుండా నిర్మాతగా, వ్యాపారవేత్తగా కూడా విజయవంతంగా రాణిస్తున్నారు.

తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన కృతి, సినిమా బడ్జెట్‌లో ఎక్కువ భాగం హీరోలకే వెళ్తుందని, ఖర్చులు తగ్గించాల్సి వస్తే ముందుగా హీరోయిన్ల పారితోషికాలపైనే కోతలు వేస్తారని అన్నారు. షూటింగ్ సమయంలో కూడా చిన్న చిన్న విషయాల్లో వివక్ష కనిపిస్తుందని, హీరోలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తారని చెప్పారు. కెరీర్ ప్రారంభంలో తన స్థాయి హీరోకు లగ్జరీ కార్ పంపించి, తనకు మాత్రం సాధారణ వాహనం ఇచ్చిన సంఘటనను గుర్తు చేసుకున్నారు. సినీ పరిశ్రమలో స్టార్ కిడ్స్ హవా ఇంకా బలంగా ఉందని, దాన్ని మార్చాల్సిన అవసరం ఉందని కృతి పేర్కొన్నారు. సినీ బ్యాక్‌గ్రౌండ్ లేకపోవడంతో ఎన్నో అవకాశాలు స్టార్ కిడ్స్‌కు వెళ్లిపోయాయని, తాను కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నానని వెల్లడించారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.




## రెండు భాగాలుగా 'విశ్వంభర'?.. క్లారిటీ ఇచ్చిన దర్శకుడు!

చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతోన్న సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర'. ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్ లేకపోవడంతో దీనిపై రకరకాల రూమర్స్ ప్రారంభమయ్యాయి. 'విశ్వంభర' రెండు భాగాలుగా రానుందంటూ కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా దీనికి సంబంధించిన ఓ పోస్ట్‌పై దర్శకుడు వశిష్ఠ (Vassishta) స్పందించారు. 'అవునా.. నిజమా' అంటూ నవ్వుతోన్న ఎమోజీలు జోడించారు. దీంతో ఈ వార్తలను పరోక్షంగా ఖండించినట్లైంది. ఒకే భాగంలో రానుందని స్పష్టం చేశారు.

పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమాలో చిరంజీవికి జోడీగా త్రిష (Trisha), ఆషికా నటిస్తున్న విషయం తెలిసిందే. వీరిద్దరితో పాటు నాగిని సీరియల్‌తో ఆకట్టుకున్న నటి మౌనీరాయ్‌తోనూ చిరు ఓ ప్రత్యేక పాటలో స్టెప్పులు వేశారు. 14 లోకాల చుట్టూ సాగే కథగా ఇది రూపొందుతోంది. హీరో డైరెక్ట్‌గా ఆ లోకానికి ఎలా వెళ్తాడు? హీరోయిన్‌ను ఎలా తిరిగి తెచ్చుకుంటాడు? అనే అంశంతో రానున్న ఈ సినిమా కోసం వాస్తవ ప్రపంచాన్ని తలపించేలా సెట్స్ వేసినట్లు గతంలోనే దర్శకుడు ఓ సందర్భంలో చెప్పారు. ప్రపంచంలోనే టాప్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు దీనికోసం పనిచేస్తున్నట్లు వెల్లడించారు. వీఎఫ్ఎక్స్ సాయంతో సరికొత్త ప్రపంచాన్ని వెండితెరపై ఆవిష్కరించామని చిరంజీవిని ఇప్పటివరకూ చూడని పాత్రలో చూస్తారని అన్నారు.






## దృశ్యం 3 తెలుగు రీమేక్ నుండి తప్పుకున్న వెంకీ.. డబ్బింగ్ వర్షన్ రిలీజ్ కు రెడీ

మోహన్ లాల్ మలయాళ సూపర్ హిట్ ఫ్రాంచైజ్ దృశ్యం తెలుగులో రీమేక్ అయ్యి ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు ఈ సిరీస్ లో భాగంగా పార్ట్ 3 తీసుకువస్తున్నాడు మోహన్ లాల్. ఈ నెల 21న వరల్డ్ వైడ్ గా రిలీజ్ అవుతోంది. కానీ ఈసారి 'దృశ్యం 3' తెలుగులో రీమేక్ కావడం లేదు. విక్టరీ వెంకటేష్ ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకోవడంతో మోహన్‌లాల్ నటించిన ఒరిజినల్ మలయాళ వెర్షన్‌నే తెలుగులోకి డబ్ చేసి విడుదల చేయాలని మేకర్స్ నిర్ణయించారు. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ భాషల్లో కూడా డబ్బింగ్ వెర్షన్లు సిద్ధమవుతున్నాయి.

ఈ చిత్రం మే 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇప్పటికే మలయాళంలో ట్రైలర్ విడుదలై సోషల్ మీడియాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. కేరళలో మరియు ఓవర్సీస్ మార్కెట్లలో అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ప్రారంభమయ్యాయి. అక్కడ సినిమాకు లభిస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద మరోసారి జార్జ్ కుట్టి మ్యాజిక్ రిపీట్ కాబోతున్నట్లు స్పష్టమవుతోంది. తెలుగు మరియు ఇతర భాషల ట్రైలర్లు, విడుదల తేదీల గురించి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అయితే మలయాళ వెర్షన్ విడుదలయ్యే మే 21నే తెలుగు డబ్బింగ్ వెర్షన్ కూడా థియేటర్లలోకి వచ్చే అవకాశం ఉందని సమాచారం. మొదటి రెండు భాగాలు తెలుగు ప్రేక్షకులకు బాగా కనెక్ట్ కావడంతో వెంకటేష్ లేకపోయినప్పటికీ మోహన్‌లాల్ వెర్షన్‌కు కూడా టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మంచి ఆదరణ లభిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394